
ANDHRAJYOTHY


ఆంధ్రజ్యోతి

5



శ్రీ పొట్టి శ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు

ఆదివారం 14 జనవరి 2024



సోమశిలలో 30.725 టీఎంసీల నిల్వ

అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 10 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. డ్యాం పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలకుగాను 30.725 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 2,400, ఉత్తర కాలువకు 250, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

పల్లెకు పండగొచ్చింది

- కలుస్తున్న ఆత్మీయ బంధువులు • ఎటు చూసినా కుశల ప్రశ్నలు • పిండి వంటకాల ఘుమఘుమలు • అల్లుళ్ల సరదాలు.. ఆడపడుచుల అనుబంధాలు



"ఏం మావా బాగున్నావా..!?
ఆ.. బాగున్నా గోపీ! నువ్వెలా ఉన్నావ్!? రా వచ్చి కూర్చో..
కోటిగాడు ఇంకా రాలేదా!? యాడున్నాడట.
నిన్నే వచ్చాడ్రా. సరేగానీ నువ్వాడున్నావ్!? ఏం చేస్తున్నావ్!? ఏమన్నా వెనకేసుకున్నావా!?
అంతా బాగానే ఉంది మామా. పండక్కి మనోళ్లంతా వచ్చినట్టున్నారే!?"

గ్రామాల్లో ఎటు చూసినా ఇలా కుశల ప్రశ్నలే వినిపిస్తున్నాయి. పొట్ట చేతబట్టుకుని నగరాలు, పల్లెలకు వలస వెళ్లిన వారంతా సంక్రాంతి పండుగ పుణ్యమా అని సొంతూళ్లకు చేరుతున్నారు. మొన్నటిదాకా పలకరించేవారు లేక ఇళ్లు ముంగిళ్లు.. రచ్చబండ్లపై బిక్కమొహం వేసుకున్న పండుటాకులు తమ వారిని చూసి మురిసి పోతున్నారు. పెద్దల పలకరింపులు.. నారీమణుల వంటకాలు.. పిల్లల కేరింతలతో అంతటా పెద్ద పండుగ సందడే. పంటలు ఇంటికి రావాల్సిన వేళ.. కరువు కరాళ నృత్యం చేస్తూ వాకిట నిలిచింది. అయినా తరతరాల వారసత్వంగా వస్తున్న పండుగను ఉన్నంతలో వేడుకగా జరుపుకునేందుకు జిల్లావాసులు సిద్ధమయ్యారు. ఈసారి నిత్యావసరాలు అటుంచితే... పూలు, పండ్లు, మామిడాకులు, తాటాకులు, తేగలకు యమా డిమాండ్ వచ్చింది. భారమైనా కొనుగోలు తప్పని సరైంది.

ఆత్మకూరు/నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 13 : రుతువులను నడిపించే సూర్యుడు దక్షిణం నుంచి ఉత్తరానికి కదిలి, మకరరాశిలోకి అడుగుపెట్టే శుభ సమయం జగతికి పర్వదినం. భోగి మంటల వెచ్చదనం... అందరిలో నూతనోత్తేజాన్ని నింపే సంక్రాంతి శుభ దినం.. పంటఫలాలు చేతికొచ్చి రైతుల లోగిళ్లలో ధాన్యరాసులను నింపుతుంది. ఇక కనుమ కర్షకుల పండుగ. తెలుగు సంస్కృతి, సంప్రదాయాల కలబోతే ఈ పండుగలు. సంక్రాంతి అంటే ఒక్కరోజులో హడావుడిగా జరిగిపోయే పండుగ కాదు. నెల రోజులపాటు పల్లె వాకిట్లో సంక్రాంతి హరివిల్లులతో పల్లెల్లో అందం.. ఆహ్లాదం, బంధువుల సరదా మాటలతో నోరు తీపి చేసుకుంటుంటే... చిన్నారులంతా ఆటపాటలతో కాలక్షేపం చేస్తారు. వ్యవసాయ నేపథ్యం, గ్రామీణ వైభవం, ధనుర్మాసం ఆరంభం నుంచే సంక్రాంతి శోభ మొగ్గ విచ్చుకుని ప్రకృతిని పరవసింపజేస్తుంది. కాగా, శనివారం అర్ధరాత్రి తర్వాత ప్రజలు ఇళ్ల ముందు, కూడళ్లలో భోగిమంటలు వేశారు.

• భోగభాగ్యాల భోగి

ప్రియభక్తురాలైన గోదాదేవిని శ్రీవారు పరిణయమాడి ఆమెకు భోగభాగ్యాలు ప్రసాదించిన రోజు కాబట్టి భోగిగా పేరొచ్చిందని నానుడి. భోగినాడు ఇంద్రుడికి పూజ చేయడం శుభకరంగా భావిస్తారు. వేకువజాము నుంచే పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా భోగి మంటలతో సంక్రాంతి పర్వదినానికి స్వాగతం పలుకుతారు. ఇందుకోసం పది రోజుల ముందు నుంచే యువకులు, చిన్నారులు పోటీపడి ముళ్లకంపలు, తాటిమట్టలు తెచ్చి ఇళ్ల ముందు పెట్టుకుంటారు. వీటితోపాటు ఇంట్లోని పాత వస్తువులన్నీ భోగి మంటల్లో వేస్తారు. కష్టాలన్నీ కాలి బూడిదవ్వాలన్నది దీని పరమార్థమని పెద్దలు చెబుతుంటారు. కొందరైతే భోగి మంటల్లోనే లేలేత తేగలు కాల్చుకుని ఆస్వాదించే వారు. మరికొందరు కోళ్లు కోసి భోగి మంటల్లోనే కాల్చి ఉదయమే వేడి వేడి కూడి కూరతో దోశలో ఆరగించే వారు. భోగి రోజే బొమ్మల కొలువు జరిపి, సాయంత్రం ముత్తయిదువులకు పేరంటం చేసుకుంటారు. రేగి పండ్లకూ పండుగలో ప్రత్యేక స్థానం ఉంది. తెలుగు సంప్రదాయం ప్రకారం భోగి నాడు పిల్లలకు భోగిపళ్లు పోస్తారు. ఈ పండ్లను పిల్లల తలపై పోస్తే ప్రత్యక్ష నారాయణ అనుగ్రహం వీరికి లభిస్తుందని విశ్వసిస్తారు.



• హరిదాసులు, గంగరెద్దుల సందడి

శ్రీకృష్ణుడే హరిదాసు రూపంలో వస్తాడని భక్తుల నమ్మకం. సంక్రాంతి సంబరాల్లో హరిదాసులు, గంగిరెద్దుల సంప్రదాయ సందడి ఉంటుంది. వీరు ఇంటింటా తిరుగుతూ తమ కళను ప్రదర్శించి ఆనందింపజేస్తారు. ఇక హరదాసులు తల మీద గుమ్మడి కాయ ఆకారంలో ఉండే పాత్ర భూమికి సంకేతం. శ్రీహరే ఈ ధరణికి పాలకుడు అని చెప్పడమే అందులోని అంతరార్థం.

• పందేల జోరు

సంక్రాంతి వచ్చిందంటే పోటీలు, పందేలు ఊపందుకుంటాయి. పల్లెల్లో కోడి పందాలు ఎక్కువగా జరుగుతాయి. కొన్ని గ్రామాల్లో ఎడ్ల పందాలు నిర్వహించి ఆనందిస్తారు. ఆటల పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

• ముగ్గుల హరివిల్లులు

ధనుర్మాసం ఆరంభం నుంచే మహిళలు తెల్లవారుజామునే ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేస్తుంటారు. ప్రతి గడప రంగువల్లులతో అందంగా మారుతుంది. ఇంటి ముంగిట ఆవుపేడతో చేసిన గొబ్బెమ్మలు ముగ్గుకు కొత్తకళను తెస్తాయి. అలాగే పలు సంస్థలు నిర్వహించే ముగ్గుల పోటీల్లోనూ నారీమణులు ఉత్సాహంగా పాల్గొంటారు. ఒకరికొకరు తోడంటూ కలిసిమెలిసి సాగించే సహజీవనానికి రథం ముగ్గు సంకేతంగా నిలుస్తుంది. అందుకోసమే ఒక రథం ముగ్గును, మరొక ఇంటి రథం ముగ్గుతో కలుపుతుంటారు.



నెల్లూరు : కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్న సండే మార్కెట్



సంగం : పిండివంటలు తయారు చేస్తున్న మహిళలు

అన్నదాతకు పెద్ద పండుగ

సంక్రాంతి అంటే రైతులకు పెద్ద పండుగే. కాడిపట్టి, మేడిపట్టి, చాలకోలు చేతబట్టి.. సరదా సరదాగా పదరా బసవన్న అంటూ అన్నదాతలు ఆడుతూపాడుతూ పొలాన్ని తొక్కుతూ సేద్యం చేసేవారు. కాడెద్దులు కూడా రైతన్న సైగలకు తగ్గట్టుగానే నడకసాగించేవి. మడక దున్నే సమయంలో ఎద్దుల మెడలోని గంటల సవ్వడికి కర్షకుడి అరుపుల శబ్దం ఎంతో లయబద్ధంగా వీనుల విందుగా ఉండేది. ఇలా పంట పొలాలన్నీ కళకళలాడుతుండగా ధాన్యాగారాలు నిండుగా, అన్నదాత హాయిగా, వ్యవసాయ ఆధారిత చేతి వృత్తుల వారు ఆనందంగా జీవించే రోజులవి.

● మొదటి రోజు భోగి పండుగను జరుపుకుంటే రెండవ రోజు పెద్ద పండుగ పేరుతో సంక్రాంతిని జరుపుకుంటారు. పిల్లలు మొదలు పెద్దలు, వృద్ధులు ఉదయాన్నే తలస్నానం చేసి కొత్త బట్టలు ధరిస్తారు. ఇళ్లలో పొంగలు పొంగించి నైవేద్యాన్ని దేవుని వద్ద ఉంచి పూజలు చేస్తారు. పితృదేవతలను స్మరించుకుంటూ వారి పేరున సాంబ్రాణి వేసి దీవించమని మొక్కుతారు. దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేస్తారు. ఇంటిల్లిపాది ఆనందంగా షడ్రుచులతో భోజనం ఆరగిస్తారు. ఈ పండుగల సందర్భంగా చిన్నా పెద్ద అన్న తేడా లేకుండా అందరూ గాలిపటాలు ఎగరవేస్తారు.

పశువుల పండుగ.. కనుమ

సేద్యంలో వెన్నుదన్నుగా నిలిచే ఎద్దులను అన్నదాతలు అత్యంతప్రీతిపాయంగా చూసుకుంటారు. కనుమ పండుగ పశువులకు అత్యంత ప్రీతికరమైంది. పండుగనాడు ఎద్దులను అలంకరించేందుకు రంగులతాళ్లు, చిక్కాలు, పట్టెంలు తదితర సామగ్రిని రెండు నెలల ముందే రైతులు సిద్ధం చేసుకుంటారు. రంగు రంగుల డిజైన్లతో తాళ్లను తమ సొంత చేతుల మీదుగా తయారు చేసి అలంకరిస్తారు. కనుమ రోజు కోడి పందేలతో ఉత్సాహంగా గడిపే వారు. ఈ పండుగ రోజే మంసాహార భోజనం అరగిస్తారు.

అల్లుళ్ల సరదాలు

సంక్రాంతి పండుగనాడు అల్లుళ్ల సరదాలు, ఆడపడుచుల అనుబంధాలు చోటు చేసుకుంటాయి. వృత్తి రీత్యా ఎక్కడున్నా ఈ పండక్కి మాత్రం కుటుంబసభ్యులంతా ఇళ్లకు చేరుకుంటారు. కొత్త అల్లుళ్లను ఇళ్లకు ఆహ్వానిస్తారు. పెత్తనం అంతా ఆడపడుచులదే. పిండి వంటలు చేసి, కొత్తబట్ట లు పెట్టే ఆనవాయితీ ఎక్కువగా కనిపిస్తుంది.

అంతా రెడీమేడ్ వంటలే!

సంక్రాంతి సందర్భంగా ప్రతి ఒక్కరూ అరిశెలు, చెక్కలు, లడ్డూలు, మురుకులు, తదితర పిండివంటలను వారం ముందు నుంచే తయారు చేయడంతో ఘుమఘుమలాడుతున్నాయి. పండుగనాడు స్నేహితులు, బంధువులకు పిండివంటలను ఇచ్చిపుచ్చుకోవడం సంప్రదాయంగా వస్తోంది. అయితే, పల్లెల్లో కొంతవరకు పిండి వంటలు చేస్తుండగా నగరం, పట్టణాల్లో దుకాణాల్లో లభ్యమయ్యే వంటలే దిక్కుగా మారాయి.

సంక్రాంతి సమయం

సోమవారం మకర సంక్రాంతి పుణ్యకాలం ఉదయం 7.15 గంటలకు మొదలై సాయంత్రం 5.46 గంటలకు ముగుస్తుంది. మహా పుణ్యకాలం ఉదయం 7.15 నుంచి 9గంటలకు ముగుస్తుంది. మకర సంక్రాంతి సందర్భంగా పితృదేవతలను స్మరించుకుంటూ తమ శక్తిమేర దానధర్మాలు చేయడం వల్ల పెద్దలు, పూర్వీకులు ఆశీస్సులు లభిస్తాయని పురాణాలు తెలియజేస్తున్నాయి.

నిరసనాగ్ని!

నెల్లూరు (వ్యవసాయం), జనవరి 13 : ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాలు ఇస్తానని ముఖ్యమంత్రి జగన్ యువతను నమ్మించి మోసం చేశారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కాకర్ల తిరుమల నాయుడు ఆధ్వర్యంలో నగరంలోని టీడీపీ కార్యాలయం ఎదుట వేసిన భోగి మంటల్లో జాబ్ క్యాలెండర్ హామీ పత్రాలు, చీకటి జీవోల ప్రతులను వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ లేదు.. ఒక్క ఉద్యోగమూ లేదంటూ మండిపడ్డారు. 2.43 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయకుండా వైసీపీ ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని విమర్శించారు. రాష్ట్రానికి రావాల్సిన పరిశ్రమలు, పెట్టుబడులు ప్రభుత్వ అసమర్థతతో వైసీపీ నేతల తీరుతో వెనక్కి వెళ్లిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సైకో పాలన పోవాలి.. సైకిల్ రావాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య, నగర అధ్యక్షుడు మామిడాల మధు, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, రాజానాయుడు, సాబీర్‌ఖాన్, పనబాక భూలక్ష్మి, వడ్లమూడి రమేష్, టిఎన్ఎస్ఎఫ్ నేతలు అమ్ములా, నన్నేసాహెబ్, దర్శి హరికృష్ణ, నారా శ్రీనివాసులు, మాతంగి కృష్ణ, నారా శ్రీనివాసులు, జలదంకి సుధాకర్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



భోగి మంటల్లో జగన్ హామీ ప్రతులు, జీవో ప్రతులను వేసి నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు



శిథిలావస్థలో చెత్త కుండీలు



మూలనపడ్డ జరాయి యంత్రాలు

'స్వచ్ఛాంధ్ర' శిథిలం

- నిరుపయోగంగా పారిశుధ్య వాహనాలు
- రూ.లక్షలు వెచ్చించి గత ప్రభుత్వం కొనుగోలు
- విదేశీ పరిజ్ఞానంతో వినూత్న సేవలు
- మూలనపడేసిన వైసీపీ పాలకులు
- స్వల్ప మరమ్మతులకూ నోచుకోక శిథిలం
- వినియోగంలో ఉంటే సమ్మె కాలంలో ఎంతో ఉపయోగం

పట్టణాలు, నగరాల్లోని ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందించేందుకు గత టీడీపీ ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర పేరుతో అందుబాటులోకి తెచ్చిన యంత్రాలు ప్రస్తుత పాలకుల నిర్లక్ష్యంతో శిథిలమవుతున్నాయి. తక్కువ మంది కార్మికులు ఉన్నప్పటికీ మంచి ఫలితాలనిస్తున్న ఆ యంత్రాలకు టీడీపీ ముద్ర పేరుతో మూలనపడేశారు. చిన్నపాటి మరమ్మతులు చేయించి వినియోగించుకోవాల్సిన వాటిని అలక్ష్యం చేయడంతో అవికాస్తా మట్టిలో కలిసిపోతున్నాయి. ఆ యంత్రాలు అందుబాటులో ఉండి ఉంటే ఇటీవల జరిగిన కార్మిక సమ్మె సమయంలో ఉపయోగకరంగా ఉండేవి.

నెల్లూరు(సిటీ), జనవరి 13 : మున్సిపల్ పారిశుధ్య రంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకువస్తూ యంత్రాల ద్వారా సేవలు అందించేందుకు గత టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అప్పటి పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ విదేశీ పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా నెల్లూరులో భారీగా వాహనాలను దిగుమతి చేసుకుని విస్తృతంగా వినియోగింపజేశారు. వీటి పర్యవేక్షణకు ఒక ప్రత్యేక అధికారిని కూడా నియమించారు. కొన్నాళ్లపాటు విశిష్టమైన సేవలందించిన అవి వైసీపీ ప్రభుత్వం రావడంతో క్రమేణ మూలనపడ్డాయి. స్వల్ప మరమ్మతులకు కూడా నోచుకోక శిథిలమవుతున్నాయి.

ఎన్నో యంత్రాలు.. అన్నీ వ్యర్థం

రోడ్లపై కాగితాలు, ప్లాస్టిక్ కవర్లు, మట్టిని గాలిద్వారా పీల్చే జరాయి యంత్రాలు 20కుపైగా నెల్లూరులో పనిచేశాయి. అలాగే, రోడ్లను బ్రష్షులతో శుభ్రం చేసే స్వీపింగ్ యంత్రాలు 10, ఇనుప డస్ట్‌బిన్ల నుంచి చెత్తను తీసుకెళ్లేందుకు కంప్యాక్టర్లు 5, కూడళ్లు, రోడ్లు, నివాసాల మలుపులు వద్ద పెద్ద ఇనుప బిన్లు అనేకం. ఇలా రాష్ట్రంలో మరెక్కడా లేనివిధంగా పైలెట్ ప్రాజెక్టుగా నెల్లూరులో అమలు చేసి మంచి ఫలితాలు సాధించింది. భూగర్భ డ్రైనేజీలో ఏర్పడ్డ సమస్యలను పరిష్కరించేందుకు కార్మిక రహితంగా సేవలందించే దిశగా మరిన్ని యంత్రాలను సమీకరించారు. వీటన్నిటిని స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ద్వారా అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ కొనుగోలు చేశారు. ప్రజలు కూడా ఆ యంత్రాల సేవలను ఆసక్తి, ఆశ్చర్యకరంగా వీక్షించారు. అయితే ప్రభుత్వం మారడంతో గత ప్రభుత్వ ఆనవాళ్లను చెరిపేస్తూ రూ.లక్షల విలువైన పరికరాలను మూలకునెట్టేశారు. విలువైన సేవలు అందించిన యంత్రాలను వినియోగించడం మానేసి పాత మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో పడేశారు. అవి అక్కడి చెట్ల కింద మట్టిలో శిథిలమవుతున్నా అటు ఉన్నతాధికారులుగానీ ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోవడం లేదు. ఆ పరికరాలన్నీ గతంలో మాదిరి పని చేస్తుంటే నిన్నమొన్నటి వరకు జరిగిన పారిశుధ్య కార్మికుల సమ్మె సమయంలో ప్రత్యామ్నాయంగా ఉపయోగ పడేవని నిపుణులు అంటున్నారు.



వాడకుండా పక్కనపెట్టిన కంప్యాక్టర్

డిమాండ్ల సాధనే లక్ష్యంగా..

డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శనివారానికి 33వ రోజుకు చేరుకుంది. నెల్లూరులోని కలెక్టరేట్ ఎదుట నిరవధిక నిరాహార దీక్ష కొనసాగుతుండగా కావలిలో భారీ ప్రదర్శన నిర్వహించారు. టీడీపీ, కాంగ్రెస్, వామపక్ష నాయకుల మద్దతుతో ఏరియా వైద్యశాల నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ప్రదర్శన జరిగింది. అనంతరం అక్కడ జరిగిన ధర్నాలో రాష్ట్ర ప్రభుత్వ తీరుపై విపక్ష నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.



కావలి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు, విపక్ష నేతలు

రీసర్వేపై అనాసక్తి

భూముల రీసర్వేను పరిశీలిస్తున్న జేసీ రోణంకి కూర్మనాథ్ (ఫైల్)



- ముందుకు రాని రైతులు
- ఇప్పటికే 731 గ్రామాల్లో డ్రోన్ ఫ్లైసర్వే పూర్తి
- కొత్తగా 98 గ్రామాల్లో ఓఆర్ఐ సర్వే
- తాజాగా నాలుగో విడత ప్రారంభం

నెల్లూరు(హరనాథపురం), జనవరి 13: డ్రోన్ ఫ్లైసర్వే, ఓఆర్ఐ సర్వే చేసి భూముల కచ్చితత్వాన్ని నిర్ధారించి, భూహక్కు పత్రాలను జారీ చేస్తామని సర్వే, రెవెన్యూ శాఖ అధికారులు చెబుతున్నా రైతులు ముందుకు రావటం లేదు. దీంతో సర్వేలో జాప్యం జరుగుతోంది. భూ యజమానులు కొందరు స్వగ్రామంలో భూములు కలిగి ఉన్నా, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై తదితర నగరాలలో నివాసం ఉంటున్నారు. అలాంటివారు భూముల రీసర్వేకు హాజరు కావటంలేదు. స్థానికంగా ఉండి కూడా రీసర్వే జరుగుతుందని తెలిసి కొందరు హాజరు కావటంలేదు. అంతే కాక రీసర్వే చేయటం ఎందుకు.. మాభూములు ఎక్కడి పోతాయి.. మాభూ ములు మాకున్నాయి కదా ? అని ఇంట్లోనే కూర్చుని మాట్లాడుతున్నారు. కొందరు భూయజమానులు తమ పట్టా భూమితోపాటు పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించి సాగు చేసుకుంటున్నారు. ఆ విషయం బయట పడుతుందోనని రీసర్వేకు సహకరించటం లేదని సమాచారం.

● తొలి విడత పూర్తి

జిల్లాలో 2021 డిసెంబరు 20న భూముల రీసర్వే ప్రారంభమైంది. తొలి విడత జిల్లాలోని 731 గ్రామాల్లో ఈ సర్వే పూర్తయింది. తొలుత డ్రోన్‌ల ద్వారా రీసర్వే నిర్వహించి, తరువాత ఓఆర్ఐ మ్యాపుల ద్వారా సర్వే చేస్తారు. ఇదే చివరి సర్వే. అనంతరం భూహక్కు పత్రాలు జారీ చేస్తున్నారు. ఓఆర్ఐ సర్వే 520 గ్రామాల్లో చేపట్టగా, 324 గ్రామాల్లో పూర్తయింది. మిగిలిన గ్రామాల్లో పూర్తి చేయ డానికి అధికారులు చర్యలు చేపట్టారు. రెండో విడతలో 97 గ్రామాల్లో సంపూర్ణంగా పూర్తి చేశారు. మూడో విడతలో 111 గ్రామాల్లో పూర్తి చేశారు. నాలుగో విడత భూముల రీసర్వే 98 గ్రామాల్లో గత సోమవారం ప్రారంభించారు.

> **731 గ్రామాల్లో సర్వే పూర్తి**
>
> జిల్లాలోని 731 గ్రామాల్లో భూముల రీసర్వేకు సంబంధించిన డ్రోన్ ఫ్లైసర్వే పూర్తయింది. 324 గ్రామాల్లో ఓఆర్ఐ సర్వే పూర్తయింది. మిగతా గ్రామాల్లో త్వరలో పూర్తిచేస్తాం.
>
> - హనుమాన్ ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్, సర్వేశాఖ



● భూ వివరాల రిజిస్టర్లు

డ్రోన్ ఫ్లై సర్వే పూర్తయ్యాక ఫొటోలు వచ్చాయి. ఆ ఫొటోలు, సర్వేశాఖ రిజిస్టర్‌లు, రెవెన్యూ శాఖ భూవివరాల రిజిస్టర్‌లతో అధికారులు భూముల వద్దకు వెళుతున్నారు. ఇలా వెళ్లే ముందు భూయజమానులకు సమాచారం ఇస్తున్నారు. అయినా వారు మాత్రం భూముల వద్దకు రావటం లేదు. దీంతో ఆ ప్రాంత వాసు లను అడిగి వారు చెప్పిన సమాచారాన్ని నమో దు చేస్తున్నారు.

● యజమాని లేకుండా...

రీసర్వే జరిగేటప్పుడు భూహక్కుదారు లేకుం టే ఇబ్బందే. ఉదాహరణకు ఓ వ్యక్తి తన తాత ఆస్తిని అనుభవిస్తున్నప్పుడు, రీసర్వేలో తాత పేరు తో భూమి ఉన్నట్లు అధికారులు సర్వే రిజిస్టర్‌ల ద్వారా గుర్తించి సర్వే చేస్తారు. తాత పేరు రికార్డుల్లోకి ఎక్కుతుంది. ఈ విషయం తెలుసుకొన్న సాగుదారు, ఈ భూమి నాది, మా తాత పేరు ఎలా రాశారని ప్రశ్నిస్తే, మళ్లీ సరిచేసుకోడానికి ఎంతో సమయం పడుతుంది. లేకపోతే తాత పేరు భూ హక్కు పత్రంలో వస్తే, దాన్ని సరిదిద్దుకోడానికి అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తుంది. అయితే ఈ విషయంలో అధికారులు రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది.

> **3.04 లక్షల సర్వే రాళ్లు**
>
> భూముల రీసర్వేకు సంబంధించి జిల్లాకు 3.04 లక్షల సర్వే రాళ్లు వచ్చాయి. వీటి విలువ రూ.45.65 కోట్లు. ఈ రాళ్లన్నింటిని సర్వే చేసిన చోట నాటారు. కాగా బ్రిటీష్ కాలంలో 1938లో ఓ సారి సర్వే జరిగింది. స్వాతంత్ర్యానం తరం 1962లో మళ్లీ సర్వే జరిగింది. తాజాగా ఇప్పుడు జరుగుతోంది.

సర్వేపల్లి కాలువలో యువకుడి గల్లంతు

నెల్లూరు(క్రైం), జనవరి 13: నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్ తూర్పువైపు సర్వేపల్లి కాలువలో ప్రమాదవశాత్తు పడిన యువకుడు గల్లంతయ్యాడు. ఈ ఘటనపై శనివారం నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. రైల్వేస్టేషన్ తూరువైపు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో మురళీకృష్ణ నర్సరీ నిర్వహిస్తున్నారు. ఆయనకు కోనసీమ జిల్లా కె గంగవరం మండలం ఉరుముడికి చెందిన ఎస్ భగవాన్(25) బంధువు. గత కొంతకాలంగా భగవాన్ నర్సరీలో పనిచేస్తూ అక్కడే ఉంటున్నాడు. ఈ నెల 12వ తేది రాత్రి భగవాన్ భోజనం చేసి చేతులు కడుక్కునే క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారీ సర్వేపల్లి కాలువలో పడి గల్లంతయ్యాడు. నర్సరీలో పనిచేసే వారు కాలువలో దూకి గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోయింది. ఈ ఘటనపై నర్సరీ యజమాని నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఎం బాబీ, ఎస్ఐ రెహమాన్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని ఈతగాళ్ల సహాయంతో కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి వరకు భగవాన్ ఆచూకి లభించలేదు.

కోడి పందేల స్థావరంపై దాడి

కావలి రూరల్, జన వరి13: కావలి మండలం అన్నగారిపాలెం వద్ద శని వారం సాయంత్రం కోడి పందేల స్థావరంపై పోలీ సులు దాడి చేశారు. పోలీ సుల కథనం మేరకు, గ్రామానికి సమీపంలోని అటవీప్రాంతంలో కోడిపం దేలు నిర్వహిస్తున్నా రన్న సమాచారంతో రూరల్ సీఐ కాటూరి శ్రీనివాసరావు, తన సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. ఈ దాడిలో కోడి పందేలు నిర్వహిస్తున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 7 కోళ్లు, రూ.13,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



పోలీసుల అదుపులో కోడి పందెంరాయుళ్లు

● **నెల్లూరురూరల్ :** కోడూరుపాడు శివారున శనివారం నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. 6 కోడి పుంజులు, రూ.35 వేలు స్వాధీనం చేసుకుని, 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ పీ.సుబ్బారావు తెలిపారు.రూరల్ ప్రాంతంలో కోడి పందేలు, పేకాట నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్సై లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

స్థల వివాదంలో అవ్వామనుమరాలిపై దాడి

● మనస్తాపంతో బాధితుల ఆత్మహత్యాయత్నం

కావలి రూరల్, జనవరి13: స్థల వివాదంలో జరిగిన దాడి తో మనస్తాపం చెందిన ధన్యాసి జయమ్మ, ఆమె మనవరాలు చాందిని పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు.ఈ సంఘటన శనివారం కావలి మండలం గౌరవరంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు, గౌరవరం ఎస్సీ కాలనీకి చెందిన జయమ్మ కు, కందిపాటి వీరరాఘవులుకు మధ్య నివాసాల సమీపంలో దారి విషయమై రెండు నెలలుగా వివాదం జరుగుతోంది. ఈ క్రమంలో జయమ్మ లాయర్‌ను సంప్రదించి వీరరాఘవులుకు లీగల్ నోటీసు పంపారు. నోటీసు పంపినప్పటికీ వివాదంలో ఉన్న ఆస్థలంలో వీరరాఘవులు గోడ నిర్మించబోగా జయమ్మ, కుటుంబసభ్యులు అడ్డుకున్నారు. వివాదాన్ని కోర్టులో తేల్చుకుందామని ఆమె చెప్పారు. దీంతో ఇరువర్గాలవారు పోలీసులను ఆశ్రయించారు. ఈ క్రమంలో శుక్రవారం వివాదాస్పద స్థలం వద్దకు సీఐ శ్రీనివాసరావు, తన సిబ్బందితో చేరుకుని వీరరావులుకు అనుకూలంగా మాట్లాడారు. కాగా శనివారం వీరరాఘవులు వివాదాస్పద స్థలంలో మెట్ల నిర్మాణం చేస్తుండగా జయమ్మ, ఆమె కోడలు సుభాషిణి అడ్డుకున్నారు. వీరరాఘవులు, ఆయన భార్య నాగమ్మ, కుమారుడు వినోద్, వారి బంధువులు సుమారు 10 మంది కలసి అడ్డుకున్న తమపై దాడిచేసినట్లు జయమ్మ పేర్కొన్నారు. ఆ సమయంలో అడ్డువచ్చిన తనను, తన మనుమరాలి దూషించారని ఆమె తెలిపారు. దీంతో మనస్తాపం చెందిన జయమ్మ, మనుమరాలు చాందిని ఇంట్లోని పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు కావలిలోని ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఈ విషయమై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. కాగా ఇరువర్గాల వారు పోలీసులతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

సీతారామపురం, జనవరి 13 : రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన సీతారామపురం మం డలం బెడుసుపల్లి గ్రామ సమీపంలో శనివారం జరిగింది. వివరా లిలా ఉన్నాయి. ఆరోగ్యశ్రీ కార్డులు పంచడానికి స్థానిక ఏఎన్ ఎం ప్రశాంతి, ఆశావర్కర్ శాంతి, వాలం టీర్ వీరప్రసాదు ము గ్గురూ మోటారుబైక్‌పై సీతారామపురం నుండి నెమళ్లదిన్నెకు వెళ్తుండగా నెమళ్లదిన్నె నుంచి సీతారామపురం వెళ్తున్న కారు వేగంగా వచ్చి మోటారుబైక్‌ను ఢీకొంది. దీంతో ముగ్గురిలో ఒకరికి కాలు విరిగిపోగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 అంబులెన్స్ ద్వారా ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



గాయపడిన వీరప్రసాదుకు చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

భూ వివాదంలో ఒకరిపై కత్తితో దాడి

కొండాపురం, జనవరి 13: భూవివాదంలో వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన శనివారం మండలంలోని చింతలదీవి లో చోటుచేసుకుంది. ఎస్ఐ ఖాజావలి కథనం మేరకు, ఎస్సీ కాలనీకి చెందిన కంచర్ల రమేష్ తండ్రి నాగయ్యకు అదే కాలనీలో ఉంటున్న జిల్లలమూడి చిన మాలకొండయ్యకు కొంతకాలంగా భూవివాదం నడుస్తోంది. దీంతో రమేష్ కత్తి తీసుకొని చిన మాలకొండయ్యపై దాడిచేయగా తల, చేయి, బొటనవేలుపై గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని కుటుంబసభ్యులు కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యశాల నుంచి అందిన సమాచారంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	113
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	206
స్కిన్‌లెస్	230
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5976
వెండి కిలో ధర	రూ. 73,900
వెండి ఒక గ్రాము	రూ. 75.90

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

నెల్లూరు(క్రైం): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. సాయిశ్రీను(60) నగరంలోని కొండాయపాలెం గేటు సమీపంలో పగలంతా భిక్షాటన చేసుకుని రాత్రి వేళల్లో దుకాణాల వద్ద నిద్రించేవాడు. ఈ క్రమంలో కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ కొండాయపాలెం గేటుకు వెళ్లే దారి పక్కనే పడుకుని ఉండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. స్థానికులు 108కు సమాచారం అందించడంతో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 11వ తేదీన మృతి చెందగా శనివారం సౌత్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి పూర్తి వివరాలు తెలియరావాల్సి ఉంది. వివరాలు తెలిసిన వారు సౌత్ ట్రాఫిక్ పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు.

బంగారం వ్యాపారులే టార్గెట్!

- నిందితులందరూ తిరుపతి జిల్లా వాసులే..
- జిల్లా ఎస్పీ డాక్టర్ తిరుమలేశ్వరరెడ్డి

దోపిడీ కేసులో 9 మంది అరెస్ట్

నెల్లూరు(క్రైం), జనవరి 13: బంగారం వ్యాపారులే టార్గెట్‌గా దోపిడీలకు పాల్పడుతున్న ఓ దొంగల ముఠా రూ.కోటి విలువ చేసే బంగారు నగలు, నగదు దోచుకెళ్లిన కేసులో పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ డాక్టర్ కే.తిరుమలేశ్వరరెడ్డి శనివారం స్థానిక ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు.

● దారి దోపిడీ జరిగిందిలా...

నెల్లూరు నగరంలోని రామ్మూర్తినగర్ మూడోవీధిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న అన్నదమ్ములు చంద్రశేఖర్‌రావు, హరికోటేశ్వరరావులు మండపాల వీధిలో జ్యుయలరీ దుకాణం నిర్వహిస్తున్నారు. దుకాణంలో బంగారు ఆభరణాలు విక్రయించడంతో పాటు ఆర్డర్లపై ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో బంగారు దుకాణాలకు ఆభరణాలు సరఫరా చేస్తుంటారు. ఈ క్రమంలో ఈ నెల 6వ తేదీన హరికోటేశ్వరరావు తన వద్ద ఉన్న బంగారంతో పాటు ఆయన స్నేహితుడైన మండపాలవీధికి చెందిన మరో బంగారం వ్యాపారి రామాచారి వద్ద కొంత బంగారంతో కలిపి సుమారు 2 కేజీల బంగారు ఆభరణాలను విక్రయించేందుకు తిరుపతి జిల్లా గూడూరుకు వెళ్లాడు. అక్కడ కొన్ని బంగారు ఆభరణాలను విక్రయించాడు. కొందరు వ్యాపారులను రూ.10 లక్షలు బకాయిలు వసూలు చేసుకున్నాడు. ఇంకా తన వద్ద ఉన్న 1758 గ్రాముల బంగారు ఆభరణాలతో కలిపి రూ.10 లక్షలు బ్యాగ్‌లో పెట్టుకొని అదేరోజు రాత్రి గూడూరు నుంచి ఆర్టీసీ బస్సులో నెల్లూరుకు బయలుదేరాడు. బస్సు నెల్లూరుకు దగ్గరలో ఉన్న సమయంలో అన్న చంద్రశేఖర్‌రావుకు ఫోన్ చేసి ఆర్టీసీ బస్టాండుకు రావాలని హరికోటేశ్వరరావు చెప్పడంతో చంద్రశేఖర్‌రావు బైక్‌పై నెల్లూరు ఆర్టీసీ బస్టాండుకు చేరుకున్నాడు. అన్నదమ్ములిద్దరూ బస్టాండు నుంచి బైక్‌పై ఇంటికి బయలుదేరారు. రామలింగాపురం రైల్వే అండర్‌బ్రిడ్జి మీదుగా న్యూ జోయాలుకస్ జ్యుయలరీ షాపు సమీపంలోకి వచ్చే సరికి మొహానికి మాస్కులు ధరించిన ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి వారిని అడ్డుకున్నారు. ఓ వ్యక్తి బైక్ దిగి అన్నదమ్ముల ఇద్దరిపై దాడి చేసి నగల బ్యాగ్‌ను లాక్కొని బైక్‌పై పరారయ్యారు. ఒక్క సారిగా జరిగిన ఈ హఠాత్పరిణా మంతో నివ్వెరపోయిన అన్నదమ్ములు తేరుకొనే లోపే దుండగులు పరారయ్యారు. ఈ మేరకు బాధితుడు హరికోటేశ్వరరావు బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో నగర, సీసీఎస్ డీఎస్పీలు డీ శ్రీనివాసరెడ్డి, శివాజీరాజా, బాలాజీనగర్, వేదాయపాలెం, సీసీఎస్, ట్రాఫిక్ పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతిక ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.



మాట్లాడుతున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

బంగారు వ్యాపారులను దోచుకుంటే వారు పోలీసులకు ఫిర్యాదు చేయరని, జీవితంలో స్థిరపడిపోతామని గతంలో బంగారం దుకాణాల్లో పనిచేసి ప్రస్తుతం తిరుపతి జిల్లా గూడూరులో నివాసం ఉంటున్న అదే జిల్లా నాయుడుపేట మండలం అన్నమేడుకు చెందిన వెంకటేశ్వర్లు భావించాడు. ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న అతను ప్రస్తుతం నెల్లూరు వేదాయపాళెంలో నివాసం ఉంటున్న అన్నమేడుకు చెందిన తన పెద్దనాన్న కుమారుడు తిరుపాల్, సమీప బంధువైన ఓజిలి మండలం పున్నేపల్లికి చెందిన బి నాగేంద్రబాబు, వాకాడు మండలం కొండాపురంకు చెందిన కె.సుబ్రహ్మణ్యంలను కలిసి తన పథకాన్ని వివరించాడు. ఆర్థిక నేపథ్యంలో వారు దోపిడీ చేసేందుకు అంగీకరించారు. ఈ క్రమంలో యువకులతో దోపిడీ చేయిద్దామని నాగేంద్రకు చెప్పడంతో అతను తన వద్ద పనిచేసే కోట మండలం చిట్టేడుకు చెందిన డ్రైవర్ వంశీ, అతని ద్వారా అదే గ్రామానికి చెందిన జగదీష్, నరేంద్ర, పాపయ్య, విద్యానగర్ కొత్తపాలెంకు చెందిన మన్దీప్ అలియాస్ చంటీ లను పరిచయం చేశాడు. అందరూ కలిసి ముఠాగా ఏర్పడి దోపిడీకి పథకం రచించారు. బంగారు వ్యాపారుల కోసం రెక్కీ నిర్వహించారు. ఈనేపథ్యంలో ఈ నెల 6న హరికోటేశ్వరరావు బంగారు ఆభరణాలు, నగదుతో వెళుతుండటాన్ని గమనించి గూడూరు నుంచి రెండు బైక్‌లు, కారుతో వెంబడించారు. నెల్లూరు మినీబైపాస్‌లోని నగల దుకాణం వద్ద నిందితుల్లో జగదీష్, పాపయ్య, నరేంద్రలు తమ బైక్‌తో బాధితులను అడ్డుకొని వారిపై దాడి చేసి నగలు, నగదు బ్యాగ్‌తో పరారయ్యారు. అందరూ కలిసి నగదు పంచుకున్నారు. వారం రోజుల తరువాత శనివారం బంగారు నగలు విక్రయించేందుకు వెళుతుండగా సాంకేతిక ఆధారంగా గుర్తించిన పోలీసు ప్రత్యేక బృందాలు వారిని తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం కోట క్రాస్‌రోడ్డు వద్ద అరెస్ట్ చేసి వారి నుంచి రూ.90.58 లక్షలు విలువ చేసే 1758 గ్రాముల బంగారు ఆబరణాలు, రూ.2.30 లక్షల, కారు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో జగదీష్, నరేంద్ర, పాపయ్య, మన్దీప్‌లు గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్నారని విచారణలో వెల్లడైందని, వారిపై గూడూరు పోలీసులు కేసు నమోదు చేశారని ఎస్పీ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి చోరీ సొత్తు రికవరీ చేయడంలో కృషి చేసిన డీఎస్పీలతోపాటు ఇన్‌స్పెక్టర్లు వీరానాయక్, కోటేశ్వరరావు, వేమారెడ్డి, ఎస్ఐ గిరి, హెడ్‌కానిస్టేబుళ్లు కేవీ సుధాకర్, రమేష్ తదితరులను ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.

> ● నిందితులందరూ తిరుపతి జిల్లా వాసులే..

అంగన్‌వాడీల వేతనాలు పెంచకుండా చర్చలేమిటి?

● పండుగలోనూ సమ్మె కొనసాగింపు ● సీఐటీయూ, అంగన్‌వాడీల యూనియన్ నేతలు

నెల్లూరు(వైద్యం), జనవరి 13 : ప్రభుత్వం అంగన్‌వాడీల వేతనాలు పెంచకుండా చర్చలేమిటని సీఐటీయూ, అంగన్‌వాడీ యూనియన్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా 33వ రోజు కలెక్టరేట్ వద్ద రిలే దీక్ష కొనసాగింది. ఈ సందర్భంగా దీక్షా శిబిరం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ మాట్లాడారు. అంగన్‌వాడీల అన్ని కోర్కెలు పరిష్కరిస్తామంటున్న ప్రభుత్వం కీలకమైన వేతనాల పెంపుపై మడత పేచి పెడుతుందన్నారు. తెలంగాణ కంటే రూ.1000 పెంచాలని కోరినా ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లేదన్నారు. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీల వేతనాలు పెంచే వరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగ దినాల్లోనూ సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. భోగిలో అంగన్‌వాడీలకు ఇచ్చిన ఎస్మా చట్టం ప్రతులను దహనం చేస్తామన్నారు. జగనన్నకు చెబుతాం అన్న నినాదంతో కోటి సంతకాలు సేకరించి ధర్మపోరాటం కొనసాగుతుందన్నారు. జిల్లాలో 5 లక్షల సంతకాలు సేకరిస్తారన్నారని, ఆ ప్రతులను తాడేపల్లి ప్యాలెస్‌కు పంపిస్తామని వెల్లడించారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రెహనాబేగం మాట్లాడుతూ అంగన్‌వాడీలకు వేతనాల పెంపుతో ప్రభుత్వం వింత వాదన వినిపిస్తుందన్నారు. తమ దగ్గర డబ్బులున్నాయి అయినా వేతనాలు పెంచేది లేదని ప్రభుత్వం చెబుతుందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. జననన్న నీ మనస్సు మారాలి అన్న నినాదాన్ని తెలిపే విధంగా పండుగ ముగ్గులు కూడా అంగన్‌వాడీలు వేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుజాత, కామాక్షమ్మ, రజనీ, మల్లెమ్మ, రమాదేవి, సుమతి, ఉషా, కల్పన, నాగభూషణమ్మ, రత్నమ్మ, హారతి, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరం వద్ద సంతకాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు

● అంగన్‌వాడీలకు మద్దతుగా ప్రదర్శన

రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి పతనం తప్పదని అఖిలపక్ష నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీల సమ్మెకు మద్దతుగా అఖిలపక్ష నేతలు, కార్మిక, ప్రజాసంఘాల నాయకులు శనివారం నగరంలోని గాంధీబొమ్మ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, టీడీపీ మహిళా జిల్లా అధ్యక్షురాలు పనబాక భూలక్ష్మి, నగర అధ్యక్షుడు మామిడాల మధు, కాంగ్రెస్ పార్టీ నగర ఇన్‌చార్జి ఫయాజ్, జనసేన నేతలు మురళి, సీపీఎంఎల్ నేత లక్ష్మీరెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, అజయ్‌కుమార్, ప్రజాసంఘాల నేతలు రషీద్, నరసింహ, షానవాజ్, మస్తాన్‌బీ, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర నేతలు కృష్ణారావు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూపు-2కు శిక్షణ

నెల్లూరు(హరనాథపురం), జనవరి 13 : నగరంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో విద్యార్థులకు గ్రూపు-2 ప్రిలిమినరీ పరీక్షలకు సంబంధించి శనివారం జిల్లా అధికారులు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణలో కోఆపరేటివ్ ఆడిట్ అధికారి తిరుపతయ్య, బీసీ సంక్షేమశాఖాధికారి వెంకటయ్య, డివిజనల్ అగ్నిమాపకశాఖాధికారి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు. వీరందరూ గ్రూపు-2 ప్రిలిమినరీ పరీక్షలో 5 సబ్జెక్టులు ఉంటాయని, వాటన్నింటిపై క్షుణ్ణంగా అవగాహన పొంది పరీక్షలకు హాజరు కావాలని కోరారు. ఈ పరీక్షల కోసం నిష్ణాతులైన అధ్యాపకులు, కోచింగ్ సెంటర్‌ల నిర్వాహకులచే శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. విద్యార్థులకు గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తామన్నారు. మోడల్ ప్రశ్నాపత్రాలు సైతం అందచేస్తామని చెప్పారు.

సమస్యలు పరిష్కరించండి

● సచివాలయ ఉద్యోగుల జేఏసీ నేతలు

నెల్లూరు(జడ్పీ), జనవరి 13: సచివాలయ ఉద్యోగులపై పనిభారం ఎక్కువగా ఉండడంతో ఉద్యోగులు మానసికంగా, శారీరకంగా, ఆర్థికంగా సమస్యలు ఎదుర్కొంటున్నారని గ్రామ, వార్డు, సచివాలయ ఉద్యోగుల జేఏజీ నేతలు పాండు, బాలరాజులు పేర్కొన్నారు. నగరంలోని ఓ కోచింగ్ సెంటర్లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సచివాలయ ఉద్యోగులు రాజ్యాంగబద్ధంగా నియమించబడిన శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులని పేర్కొన్నారు. ఐతే కొంత మంది సచివాలయ ఉద్యోగులను రాజ్యాంగ విరుద్ధంగా నియమించారని ఇష్టమొచ్చినట్టు రాజకీయ ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఉద్యోగులపై అనేక చోట్ల భౌతిక దాడులు జరిగాయని, కొన్ని సందర్భాల్లో పని ఒత్తిడితో పలువురు ఉద్యోగులు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్ని ఇబ్బందులు పడుతూ కూడా క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తున్నామన్నారు. ఐతే ఉద్యోగులకు ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను కింది స్థాయిలో సక్రమంగా ఆచరణకు నోచుకోవడం లేదని, ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరారు.

నేడు విక్టర్ ప్రసాద్ రాక

నెల్లూరు(హరనాథపురం), జనవరి 13 : ఏపీ స్టేట్ ఎస్సీ కమిషన్ ఛైర్మన్ ఎం.విక్టర్ ప్రసాద్ ఆదివారం జిల్లా పర్యటనకు రానున్నారని డీడీఐపీ ఆర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మధ్యా హ్నం ఒంటి గంటకు ఆయన నెల్లూరుకు చేరుకొంటారని తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి 2.30 గంటల మధ్య మీడియాతో సమావేశమవుతారని తెలిపారు. 2.30 గంటలకు తిరుపతికి బయలుదేరి వెళతారని తెలిపారు.

సంక్రాంతిని ఆనందంగా జరుపుకోవాలి

● ప్రముఖుల శుభాకాంక్షలు

నెల్లూరు (సాంస్కృతికం) : జిల్లాలోని ప్రజలందరూ భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ఆనందంగా జరుపుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. సంక్రాంతి ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖ సంతోషాలను నింపాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాజీ మంత్రి పొంగూరు నారాయణ, జాతీయ కార్యదర్శి బీద రవిచంద్ర, పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జాయింట్ కలెక్టర్ కూర్మానాథ్ వేర్వేరు ప్రకటనల్లో సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

నాటు తుపాకీ స్వాధీనం

మనుబోలు, జనవరి 13: మండలంలోని వీరంపల్లి గ్రామ సమీపంలో నాటు తుపాకీతో తిరుగుతున్న సూరా అంకయ్య అనే వ్యక్తిని శనివారం పొదలకూరు సీఐ రాంబాబు అదుపులోకి తీసుకున్నారు. పొదలకూరు మండలం ఎమ్మార్వో కాలనీకి చెందిన అంకయ్య నెల్లూరులోని నక్కలోళ్ల సెంటర్ వద్ద కొద్ది రోజులుగా తిరుగుతుండేవాడు. అక్కడవాళ్ల కళ్ళుగప్పి ఓ వ్యక్తికి చెందిన నాటు తుపాకీని తస్కరించి, పిట్టలు, జీవాలు కొట్టేందుకు నాటు తుపాకీతో తిరుగుతున్నాడు. ఇది గమనించిన వీరంపల్లి గ్రామస్థులు సమాచారం ఇవ్వడంతో సీఐ అంకయ్యను అదుపులోకి తీసుకుని నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

పల్లెల్లో సంక్రాంతి సంబరాల ప్రారంభం


చేజర్ల: చిత్తలూరులో క్రికెట్ పోటీల్లో పాల్గొన్న యువకులు

చేజర్ల, జనవరి 13: సంక్రాంతి పండుగ వాతావరణంతో గ్రామాలు కళకళలాడుతున్నాయి. పలు గ్రా మాలలో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. చిత్తలూరు గ్రామంలో స్థానిక యువకులు భోగి, సంక్రాంతి రెండు రోజులు క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. అలాగే ఈ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేయనున్నారు.

వరికుంటపాడు: పల్లెల్లో సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం జరిగే భోగి పండుగకు యువత తాటాకులు, ముళ్లకంప తమ నివాసాల వద్దకు చేర్చుకొని సిద్ధంగా ఉంచారు. అలాగే ఇతర ప్రాంతాల్లో ఉన్న కుటుంబ సభ్యులు సైతం నివాసాలకు చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది.

కలిగిరి: మండల ప్రజలు సంక్రాంతి వేడుకలకు సిద్ధమయ్యారు. యువకులు, చిన్నారులు వారం నుంచి తాటాకు మోపులను మోటార్‌సైకిళ్లపై తెచ్చుకుని పెట్టుకున్నారు. కాగా 20 తాటాకుల మోపును రూ.100పెట్టి కొనుగోలు చేశారు. మహిళలు పిండివంటలు తయారీలో నిమగ్నమయ్యారు.

వ్యాపారం, ఉద్యోగరీత్యా దూర ప్రాంతాలకు వెళ్లినవారు బంధు మిత్రులతో స్వగ్రామాలకు తరలివచ్చారు. ఆదివారం తెల్లవారు జామున భోగి మంటలు వేశారు.

● **నేతల సంక్రాంతి శుభాకాంక్షలు**

కందుకూరు: కందుకూరు నియోజకవర్గ ప్రజలకు ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పక్షాల నేతలు వేర్వేరు ప్రకటనల్లో సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి, ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, తూమాటి మాధవ రావు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు పోతుల రామారావు, దివి శివరాం, టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్‌లు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంక్రాంతి ప్రజల జీవితాల్లో కొత్త శోభను తేవాలని వారు ఆకాంక్షించారు.

లింగసముద్రం: సంక్రాంతిని మండల ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, మండల జనసేన అధ్యక్షుడు అంగుళూరి నరసింహారావులు శనివారం ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలకు వారు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

అంగన్‌వాడీల సమ్మెకు ప్రతిపక్షాల మద్దతు


ఆత్మకూరు : సంతకాలు చేస్తున్న ప్రజా సంఘాల నేతలు, అంగన్‌వాడీలు

కావలిటౌన్, జనవరి13: అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా శనివారం ప్రతిపక్షాల నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఏరియా వైద్యశాల నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నాయకులు అంగన్‌వాడీల శిబిరంలో కూర్చుని సంఘీభావం తెలిపారు. శిబిరంలో కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి లేళ్ళపల్లి సురేష్‌బాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి చింతాల వెంకట్రావు, టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, శ్రీహరినాయుడు, జ్యోతి బాబురావు, జనసేన నేత సాయివితల్, సీపీఎం నేత పెంచలయ్య, సీపీఐ నేత బలిజేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ప్రజలంతా అంగన్‌వాడీల సమ్మెకు అండగా ఉంటారని, భయపడాల్సిన పనిలేదని వారికి ప్రతిపక్షాల నాయకులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నాగరాజు, దుర్గాబాబు, సీపీఎం నాయకులు ఎస్ వెంకయ్య, రాయి మాల్యాద్రి, తుమ్మల మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు శనివారం ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో బైఠాయించి సమ్మెను కొనసాగించారు. వీరికి మద్దతుగా సీపీఎం, సీఐటీయు నాయకులు కె డేవిడ్‌రాజు, లక్ష్మ కృష్ణప్రసాద్, ఆత్మకూరు నాగయ్య, కొండమూరి హజరత్తయ్య తదితరులు శిబిరానికి విచ్చేసి సంఘీభావం ప్రకటించి జగనన్నకు సమస్యలు చెబుదాం కార్యక్రమంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి రాధ, పలువురు సెక్టార్ లీడర్లు కె రమణమ్మ, కామేశ్వరి, జమీల, విజయలక్ష్మీ, రూతమ్మ, విజయలక్ష్మి, శ్రీదేవి, ఏ మస్తానమ్మ, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

సంగమేశ్వరాలయ హుండీ లెక్కింపు


సంగమేశ్వరాలయ హుండీ లెక్కిస్తున్న సభ్యులు

సంగం, జనవరి 13: స్థానిక సంగమేశ్వరాలయ హుండీని దేవాదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో ట్రస్ట్ బోర్డు కమిటీ సభ్యుల సమక్షంలో శనివారం లెక్కించారు. రెండు నెలల కాలానికి సంబంధించి హుండీ లెక్కించగా రూ. 1,00,551 భక్తుల నుంచి కానుకలు వచ్చాయి. వీటితో పాటు హుండీలో ఒక కాసు, చిన్న సైజు బంగారు డాలర్ ఉండగా వీటిని మళ్లీ హుండీలో వేశారు. ఈ కార్యక్రమంలో ఈవో పెంచలప్రసాద్, పూజారి గోపాలకృష్ణమూర్తి, ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు ఉన్నారు.

40 మద్యం సీసాల స్వాధీనం

ఉదయగిరి రూరల్, జనవరి 13: మండలంలోని వెంగళరావునగర్ గ్రామంలో మద్యం బెల్టుషాపులపై దాడులు నిర్వహించి 40 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి శనివారం తెలిపారు. ఈ దాడుల్లో మద్యం విక్రయిస్తున్న రావినూతల ఏసు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


నిర్వాహకులకు నగదు అందజేస్తున్న వెంకటేశ్వర్లు

వరికుంటపాడు, జనవరి 13: మండలంలోని కాంచెరువు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న విఘ్నేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి శనివారం జీఎంకే ట్రస్టు అధినేత గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి తన ప్రతినిధులచే నిర్వాహకులకు లక్ష రూపాయల విరాళం అందజేశారు. గ్రామస్థులు ఆలయ నిర్మాణం చేపడుతున్నామని గుంటుపల్లి దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఆయన తనవంతుగా రూ.లక్ష విరాళం ప్రకటించి అందజేశారు. నిర్వాహకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధి వెంకటేశ్వర్లు, నిర్వాహకులు నాగభూషణం పాల్గొన్నారు.

కలిగిరిని వీడని ట్రాఫిక్ కష్టాలు


కలిగిరమ్మ కూడలిలో ప్రధాన రహదారిపై నిలిపి ఉన్న వాహనాలు

కలిగిరి, జనవరి 13 : పట్టణంలోని కలిగిరమ్మ కూడలి నాలుగు రహదారులు కలిసే ప్రాంతం. కావలి, విజయవాడ, నెల్లూరు, చెన్నై, ఉదయగిరి, కడప, కందుకూరు, హైదరాబాదు ప్రాంతాలకు నాలుగు మార్గాల వెళ్లే బస్సులు ఆగే స్థలం కావడంతో జనసంద్రంగా ఉంటుంది. ఈ ప్రాంతంలోనే ప్రధాన వాణిజ్య దుకాణాలు, హోటళ్లు, కూరగాయల దుకాణాలు, తోపుడు బండ్లులతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ ప్రాంతం స్థానిక పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఉంటుంది. ఉదయం 6 నుంచి 10, సాయంత్రం 3 నుంచి 7 గంటల వరకు ఈ ప్రాంతంలో పాదచారులు నడవాలన్నా, వాహనదారులు ప్రయాణించాలన్నా తీవ్ర ఇక్కట్లు ఎదుర్కోవాల్సిందే. దీంతో వాహనదారుల మధ్య నిత్యం వాగ్వాదాలు చోటు చేసుకుంటున్నాయి. దుకాణాలు, తోపుడు బండ్లు రోడ్డు పైకి చొచ్చుకొని రావడం, దుకాణాల వద్ద కొనుగోలుదారులతో నిత్యం రద్దీగా ఉంటూ ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం అందరికి తెలిసిందే. ఇప్పటికైనా ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో సిబ్బందిని నియమించి ట్రాఫిక్ కష్టాల నుంచి తమకు ఉపశమనం కలిగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల్లో యథేచ్ఛగా బెల్టు షాపులు

లింగసముద్రం, జనవరి 13 : మండలంలోని అన్ని గ్రామాల్లో మద్యం బెల్టు షాపులు కనీసం 3 నుంచి 10 షాపుల వరకు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. గ్రామాల్లోని బంకులు, బడ్డీ కొట్లు, ఇంకా చిన్న చిన్న అంగళ్లు, కొన్ని ఇళ్లలో మద్యం సీసాలు నిల్వ ఉంచుకొని అమ్ముకుంటున్నారు. ఈ మద్యం సీసాలు ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచే సరఫరా అవుతున్నట్లు ఆరోపణలున్నాయి. మండలంలోని లింగసముద్రం, పెదపవని గ్రామాల్లో ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. వాస్తవానికి ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు బెల్టు షాపుల నిర్వాహకులు మద్యం సీసాలను ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో తీసుకెళుతుంటారు. అయితే వీరు మద్యం దుకాణాల వద్ద ఒక్కో సీసాపై రూ.10 నుంచి రూ.20 వరకు అధికంగా సొమ్ము చెల్లించి కొనుగోలు చేసి, తమ బెల్టు షాపుల వద్ద రూ.20 నుంచి రూ.50 అధిక ధరకు అమ్ముతుంటారు. ముఖ్యంగా ప్రభుత్వ దుకాణాల పక్కనే ఇద్దరు వ్యక్తులు రెండు దుకాణాలు అద్దెకు తీసుకొని మంచినీరు, కూల్‌డ్రింక్స్ ఇతర వస్తువులు విక్రయిస్తూ, వాటితోపాటు మద్యం కూడా అమ్ముతున్నారని ఆరోపణలు ఉన్నాయి. సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోక పోవడంతో మద్యం ఏరులై పారుతోంది.ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎన్టీఆర్ వర్ధంతికి విస్తృత ఏర్పాట్లు


సభావేదిక స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

వరికుంటపాడు, జనవరి 13: నియోజకవర్గ స్థాయిలో జరగనున్న దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతి వేడుకలకు టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేయనున్న సభావేదిక స్థలాన్ని పరిశీలించి చదును చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 18న మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు ఆధ్వర్యంలో వేడుకలు జరగనున్నాయని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, జిల్లా టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్‌అజీజ్, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి తదితరులు పాల్గొంటారన్నారు. అనంతరం విస్తృతస్థాయి సమావేశం జరుగుతుందన్నారు. అందులో భాగంగా జడదేవి నుంచి సభా ప్రాంగణం వరకు మోటార్‌బైక్ ర్యాలీ, రక్తదాన శిబిరం, అన్నదానం కార్యక్రమాలు ఉంటాయన్నారు. కావున నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని ఆయన కోరారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

వరికుంటపాడు, జనవరి 13: స్థానిక క్రీడా మైదానంలో శనివారం ఎంపీడీవో శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న తిమ్మారెడ్డిపల్లి జట్టు 10 ఓవర్లలో 78 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్ చేపట్టిన వరికుంటపాడు జట్టు 52 పరుగులకే ఆలౌటై ఓటమి పాలైంది. దీంతో విజేతగా నిలిచిన జట్టుకు అధికారులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సికిందర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆంద్రా పరంధామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


సంక్షేమ పథకాలపై ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఉదయగిరి రూరల్, జనవరి 13: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అధికారులు, నాయకులు పేర్కొన్నారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పథకాలపై ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటస్వామి, చల్లా సుబ్బరత్నం, ఎంపీడీవో ఈశ్వరమ్మ, ఈవోపీఆర్డీ మల్లికార్జున, వైద్యాధికారిణి శివకల్పన, ఏపీఎం ఖాజారంతుల్లా, ఈవో నరసయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత బస్సు పాసుల పంపిణీ

సీతారామపురం, జనవరి 13: సీతారామపురం, ఉదయగిరి మండలాలకు చెందిన దివ్యాంగులకు ఉచిత బస్సు పాసులు ఇవ్వనున్నట్లు దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధి ఓంకారం వెంకటసుబ్బరాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉచిత బస్సు పాస్‌ల కోసం సీతారామపురం, ఉదయగిరి మండలాలకు చెందిన దివ్యాంగులు 9492680279, 7337268192, 898556413 నెంబర్లకు ఈనెల 20వ తేదీ లోపు వివరాలను అందించాలన్నారు.

గంధ మహోత్సవ గోడపత్రిక ఆవిష్కరణ

అనంతసాగరం, జనవరి 13: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఉన్న హజరత్ యూసుఫ్ అలిషా ఖాదరీ గంధమహోత్సవ గోడ పత్రికను దర్గాలో శనివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఫాతేహా నిర్వహించి భక్తులకు ప్రసాదాలు అందించారు. వచ్చేనెల 10 జరిగే గంధ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని దర్గా నిర్వాహకులు సయ్యద్‌షా హాజి అలిషా ఖాదరి తెలిపారు.

ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి జన్మదిన వేడుకలు


ఆత్మకూరు: మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, వైసీపీ నేతలు

ఆత్మకూరు, జనవరి 13: ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి జన్మదిన వేడు కలను శనివారం పలువురు ప్రజా ప్రతి నిధులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఎస్టీ కాలనీలో మహిళలకు చీరలు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు పెమ్మసాని ప్రసన్నలక్ష్మీ, జెసీయస్ కన్వీనర్లు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాడు: మండల కేంద్రంలో శనివారం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి జన్మదిన వేడుకలు వైసీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ శ్రీనివాసులు నాయుడు, జేసీఎస్ కన్వీనర్ మోహన్‌రెడ్డి, పలువురు సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

సంగం: స్థానిక వైస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కంచి పరమేశ్వరరెడ్డి దాతృత్వం అభినందనీయం

● **మెడికవర్ హస్పటల్స్ చైర్మన్ డాక్టర్ గుండాల**


మాట్లాడుతున్న మెడికవర్ హస్పటల్స్ చైర్మన్ డాక్టర్ గుండాల అనిల్‌కృష్ణారెడ్డి

ఆత్మకూరు, జనవరి 13 : సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి దాతృత్వం అభినందనీయమని మెడికవర్ హస్పటల్స్ చైర్మన్ డాక్టర్ గుండాల అనిల్ కృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ జిల్లా వైద్యశాలలోని నిత్యాన్నదాన ప్రాంగణంలో శనివారం సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ఆత్మీయ అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఆత్మకూరులోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు వచ్చే అవుట్ పేషంట్లు, వారికి తోడుగా వచ్చే కుటుంబసభ్యులకు ప్రతి రోజు అన్నదానం చేస్తున్న కంచి పరమేశ్వరరెడ్డి అభినందనీయుడని అన్నారు. దాంతో పాటు మున్సిపాల్టీ పరిధిలో ఎవరు మరణించినా వారి కుటుంబాలకు రూ. 10వేలు అందజేస్తుండడం హర్షణీయమన్నారు. అనంతరం పలువురు పట్టణ ప్రముఖులు డాక్టర్ గుండాల అనిల్‌కృష్ణారెడ్డిని, ఆయన తండ్రి ఆత్మకూరు మాజీ సర్పంచ్ గుండాల హనుమాన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి, విశ్రాంత హెచ్‌ఎం కేవీ శేషారెడ్డి, ఎస్ యానాదిరెడ్డి, డాక్టర్ అనిల్‌కుమార్, రాంపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు అభివృద్ధికి కలిసి రండి!

● **విద్యావంతుల సమావేశంలో టీడీపీ నేత ఇంటూరి**


ప్రొఫెషనల్స్ సమావేశంలో మాట్లాడుతున్న ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, జనవరి 13: కందుకూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఈ ప్రాంత ప్రొఫెషనల్స్ అంతా బాధ్యత తీసుకోవాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సీఎం జగన్మోహనరెడ్డి దుర్మార్గపు పాలనలో రాష్ట్రానికి కోలుకోలేని దెబ్బ తగిలిందని, రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని, ప్రజల తలరాతలు మార్చే బాధ్యతను విద్యావంతులు, ఉద్యోగులు, మేధావులు తీసుకోవాలన్నారు. పట్టణంలోని వెంగమాంబ ఫంక్షన్‌హాలులో శనివారం రాత్రి నియోజకవర్గంలోని విద్యావంతులు, ఐటీ ఉద్యోగులు, గ్రాడ్యుయేట్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటూరి మాట్లాడుతూ నాలుగేళ్లలో జగన్ వ్యవస్థలన్నింటిని నాశనం చేశాడని విమర్శించారు. ప్రస్తుతం మీరంతా మార్పునకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రశ్నించిన వారిని కక్షగట్టి వేధించటం ఎదురుతిరిగిన వారిని అడ్డులేకుండా తొలగించివేయటం నేటి పాలనాతీరుగా ఉందని ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ఉద్యోగులు, మేధావులే బాధ్యతను భుజానవేసుకుని రాష్ట్రంలో మార్పుకు నాందిపలికేలా చూడాల్సిన సమయం వచ్చిందన్నారు. మాజీఎమ్మెల్యే దివి శివరాం మాట్లాడుతూ జగన్ అనే ఆర్థిక ఉగ్రవాదిని నమ్మి గత ఎన్నికల్లో మనలో కూడా అనేకమంది ఆయన గెలుపులో భాగస్వాములయ్యారని ప్రస్తుతం మీరంతా మార్పుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ఐటీ ఉద్యోగుల ప్రశ్నలకు నాగేశ్వరరావు బదులిస్తూ కందుకూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలతో పనిచేస్తానని నూతన పరిశ్రమల స్థాపన ద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాల మెరుగుకి చర్యలు తీసుకుంటానని వివరించారు. ఈ కార్యక్రమంలో పొడపాటి తేజస్విని, చల్లా శ్రీనివాసరావు, గొట్టిపాటి వంశీ, బొబ్బూరి వెంగళరావు, సునీల్, రసూ ల్, పువ్వాడి మౌనిక, దామా మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సుకుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు


రక్తదాతలకు బహుమతులు అందిస్తున్న సుకుమార్ రెడ్డి

కావలిటౌన్, జనవరి13: ఏఎంసీ మాజీ చైర్మన్, వైసీపీ నాయకులు మన్నెమాల సుకుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. టీచర్స్ కాలనీలోని ఆయన నివాసంలో జరిగిన వేడుకలకు సుకుమార్‌రెడ్డి అభిమానులు, వైసీపీ నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారు. భారీ కేక్‌కట్ చేయించి పూలమాలలు, బొకేలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. రెడ్‌క్రాస్ సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 192 మంది రక్తదానం చేశారు. రక్తదాతలకు ఆయన బహుమతులు అందచేశారు. అనంతరం సుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ తనను నమ్ముకున్నవారికి అండగా ఉంటానన్నారు. అధికారం శాశ్వతం కాదని, తాను అధికారానికి దూరంగా ఉన్నా వేలాదిమంది తనకు మద్దతుగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో సీఎంజగన్ నిర్ణయం మేరకే నడుచుకుంటానని తెలిపారు.

అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్ పోటీల ప్రారంభం


ఫుట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న పసుపులేటి సుధాకర్

బిట్రగుంట, జనవరి 13: బోగోలు మండలం బిట్రగుంట రైల్వే ఇంగ్లీష్ మీడియం లిటిల్ ఇంగ్లాండ్ క్రీడామైదానంలో శనివారం అంతర్‌రాష్ట్ర సంక్రాంతి ఇన్విటేషన్ ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. పీఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పసుపులేటి సుధాకర్- సుగుణ దంపతులు ఈ పోటీలను ప్రాంభించారు. చెన్నై ఐసీఎఫ్ రైల్వే అధికారి ఐయ్యా.శ్రీనివాసులు, ఐసీఎఫ్ ఎస్ఎస్ఈ కేవీ.రమేష్‌లు ముఖ్యఅతిథులు పాల్గొన్నారు. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక బెంగళూరు, హుబ్లీ తదితర ప్రాంతాల నుంచి 25 జట్లు వచ్చాయని నిర్వాహకులు ఏ.ఆంథోని, మోజేస్ చిట్టిబాబు, నైనిల్ తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు విజయకుమార్, జీవన్, పరిమి సీతారామయ్య, గుంజి శ్రీనివాసులు, పంది ప్రసాద్, గుత్తి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పసుపులేటి సుధాకర్ మాట్లాడుతూ బిట్రగుంటకు పూర్వవైభవం తీసుకువస్తామన్నారు.

వెంకట సాయితేజకు అభినందనలు

కావలి, జనవరి 13 : స్థానిక శ్రీచైతన్య డిగ్రీకళాశాల అధ్యాపకుడు పేరూరి వెంకట సాయితేజ ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అవార్డు అందుకోవడంపై పలువురు అభినందనలు తెలిపారు. శనివారం కళాశాల చైర్మన్ డా క్టర్ బెజవాడ రవికుమార్, కరస్పాం డెంట్ పాపిశెట్టి జానకీరామ్, ప్రిన్సిపాల్ పీవీ రావు, రెడ్‌క్రాస్ చైర్మన్ డీ. రవిప్రకాష్, లైవ్ బ్లడ్ వరల్డ్ సంస్థ అధ్యక్షుడు కదిరి మధు సూర్య, టీమ్ సేవియర్స్ అధ్యక్షుడు ప్రణీత్, గుడ్ హార్ట్ ఫౌండేషన్ చైర్మన్ పసుపులేటి సాయికుమార్ అభినందనలు తెలిపారు.

దాదా దాదీమా దర్గాలో వైభవంగా గంధ మహోత్సవం


పూలాలంకరణలో దాదా దాదీమా దర్గా

అల్లూరు, జనవరి 13 : అల్లూరులోని 200 ఏళ్లనాటి దాదా దాదీమా దర్గాలో శనివారం రాత్రి గంధ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. దర్గాను పూలతో సుందరంగా అలంకరించి, కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. రాత్రి 12 గంటల వరకు ఫాతెహాలు నిర్వహించి, అనంతరం గంధ మహోత్సవాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. దర్గాను దర్శించుకునేందుకు టీడీపీ నాయకులు బీద గిరిధర్, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి-శివప్రియ దంపతులు, పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తదితరులు తరలివచ్చారు. వీరికి కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

లింగసముద్రంపై మంచు దుప్పటి


లింగసముద్రాన్ని కమ్మేసిన పొగ మంచు

లింగసముద్రం, జనవరి 13: లింగసముద్రాన్ని శనివారం తెల్లవారుజామున మంచుదుప్పటి కమ్మేసింది. 4 గంటల నుంచి లింగసముద్రంతోపాటు పరిసర గ్రామాలను మంచు దుప్పటి కమ్మేయడంతో ఎదురుగా ఏముందో కూడా కనిపించని పరిస్థితి. ఎదురుగా వస్తున్న బస్సులు, లారీలు, ద్విచక్ర వాహనాలు రోడ్డుపై కనపడక పోవడంతో లైట్లు వేసుకొని వెళ్లాల్సి వచ్చింది. పొగమంచు కారణంగా వాకింగ్‌కు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 7.30 గంటలకు మంచుదుప్పటి తొలగిపోయింది.

మాలకొండ ఆదాయం రూ. 7,60,651

వలేటివారిపాలెం, జనవరి 13: మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 7,60,651 ఆదాయం లభించినట్లు ఆలయ ఏసీ కే.బీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు.. అష్టోత్తరం టికెట్‌ల ద్వారా రూ. 7,900, కుంకుమార్చన ద్వారా రూ. 29,440, వివాహాల ద్వారా రూ. 1000, తలనీలాల ద్వారా రూ. 34 వేలు, వాహనపూజల ద్వారా రూ. 4,020, ప్రత్యేకదర్శం ద్వారా రూ. 2,37,100, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 1,320, రూము అద్దెల ద్వారా రూ. 16,910, కవర్ల విక్రయం ద్వారా రూ. 4,500, లడ్డూప్రసాదం ద్వారా రూ. 1,84,610, అన్నదానం ద్వారా రూ. 2,29,201, విరాళాల ద్వారా రూ. 10,650 ఆదాయం లభించినట్లు ఆయన తెలిపారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

లింగసముద్రం, జనవరి 13 : సంక్రాంతి సందర్భంగా మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఎం బాజీబాబు శనివారం చెప్పారు. పండుగ రోజుల్లో పేకాట, కోడిపందేలు, గుండాట నిర్వహించినా, పాల్గొన్న వారిపైనా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఈ బైక్ ఎవరిది.. ?


కోవూరుపల్లి జాతీయ రహదారి పక్కన పల్సర్ బైక్

బిట్రగుంట, జనవరి 13: బోగోలు మండలం కోవూరుపల్లి జాతీయ రహదారి పక్కన ఉన్న పల్సర్ బైక్ (ఏపీ 39డీబీ 0150) ఎవరిదనేది అంతుచిక్కడం లేదు. వారం రోజులుగా రోడ్డు పక్కన నిలిపి ఉన్న ఈ బైక్ వెనుక నంబరు ప్లేటు తీసేసి ఉన్నారు. దీన్ని చూసి గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ బైక్ ఎవరిది.. ఎందుకు ఈ విషయంలో పోలీసులు చొరవ తీసుకుని నిగ్గు తేలాల్సి ఉంది.

ఆడుదాం ఆంధ్రా పోటీలు


కబడ్డీ ఆడుతున్న ఎంపీపీ ప్రసాద్ నాయుడు

దగదర్తి (బిట్రగుంట), జనవరి 13: దగదర్తి మండల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు శనివారం ఎంపీడీవో వెంకటనారాయణమ్మ, ఎంఈవో భాస్కర్ ఆధ్వర్యంలో జరిగాయి. ఎంపీపీ తాళ్ళూరి వెంకట కృష్ణ ప్రసాద్ నాయుడు పురుషుల కబడ్డీ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన ఓ జట్టువైపు బరిలో దిగి కబడ్డీ ఆడారు. కార్యక్రమంలో తడకలూరు సర్పంచు ఆత్మకూరు గిరినాయుడు, మండల రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వస్త్రాల పంపిణీ


కందుకూరు : సంక్రాంతిని పురస్కరించుకుని ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి శనివారం వస్త్రాలు పంపిణీ చేశారు. కరస్పాండెంట్ కంచర్ల రామయ్య తన కుటుంబసభ్యులతో కలిసి అందరికీ వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టరు సీహెచ్ రవికుమార్ మాట్లాడుతూ సిబ్బంది సంక్షేమం విషయంలో కరస్పాండెంట్ రామయ్య సహృదయత అభినందనీయమని పేర్కొన్నారు.


వస్త్రాలు అందుకున్న ఉద్యోగులు

నకిలీ పట్టాలపై చర్యలు తీసుకోండి

నెల్లూరురూరల్, జనవరి 13 : నెల్లూరురూరల్లోని వైఎస్‌ఆర్ నగర్‌లో దొంగ పట్టాల చలామణిపై చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతవాసులు తహసీల్దారు కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శనివారం డీటీకి వినతిపత్రం అందచేసి మాట్లాడారు. తమ ప్రాంతంలో ఖాళీ స్థలాలు, పార్కు స్థలాలకు నకిలీ పట్టాలు సృష్టించి అమ్మేస్తున్నారని, మరికొందరు ఆక్రమణ చేస్తున్నారని తెలిపారు.

అర్ధరాత్రి నుంచే భోగి మంటలు



బుచ్చిరెడ్డిపాళెం,జనవరి13: నేడు(ఆదివారం) భోగి సందర్భంగా బుచ్చిపాటు మండలంలోని గ్రామాల ప్రజలు శనివారం నుంచే సందడిలో మునిగారు. కొత్త దుస్తులు, పిండివంటల సామానులు, కూరగాయల కొనుగోళ్ల కోసం వచ్చిన జనాలతో బుచ్చి బస్టాండ్ సెంటర్, చెన్నూరురోడ్డు కిటకిటలాడాయి. గ్రామాల నుంచి తాటాకులు తెచ్చి బుచ్చిలో అమ్ముకున్నారు. శనివారం రాత్రి 11 గంటల నుంచే యువత ప్రధాన కూడళ్లలో యువత భోగి మంటలు వేశారు.

కోవూరు: సంక్రాంతిని నిర్వహించుకునేందుకు మండల ప్రజలు సర్వం సిద్ధం చేశారు. ఇంటిముంగిట భోగిమంటలు వేసేందుకు తాటాకు సిద్ధంచేశారు. పండుగ సామగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చిన ప్రజలతో బజారు కూడలి లో శనివారం రాత్రి కిక్కిరిసింది. ప్రతి భోగికి ఎడ్ల పరుగుపందేలు నిర్వహి స్తుంటారు. ఈ ఏడాది కూడా కొత్తూరు రోడ్డులో నిర్వహిం చేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ పోటీలకు రాష్ట్ర నలుమూ లల నుంచి ఎడ్లు, పశుపోషక అభిమానులు ఆదివారం ఉదయానికి కోవూరుకు చేరుకోనున్నారు.

● కోడి పందేల నిషేధం

కోవూరు సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో కోడిపందేలు, జూదం నిషేధమని, నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఎక్కడైన కోడిపందేల్ని నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సంక్రాంతిని ఆనందంగా నిర్వహించుకోవాలన్నారు. సమావేశంలో ట్రైనీ డీఎస్పీ హేమలత, ఎస్ఐ రంగనాథగౌడ్ పాల్గొన్నారు.

కనుల పండువగా భోగి తోట ఉత్సవం



భోగి తోట ఉత్సవంలో గోదాదేవి

నెల్లూరు(సాంస్కృతికం), జనవరి 13 : ధనుర్మాసం ముగింపు సందర్భంగా గోదాదేవికి భోగి తోట ఉత్సవం శనివారం కనుల పండువగా జరిగింది. తల్పగిరి రంగనాథస్వామి ఆలయం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవంలో ఆండాళ్ అమ్మవారికి విశేష అలంకారం చేసి, మంగళ వాయిద్యాలతో ప్రారంభమన ఊరేగింపు ఆలయం నుంచి నవాబుపేట బుజ్జమ్మ తోట వరకు సాగింది. భక్తులు అమ్మవారికి ఇంటింటా కర్పూర నీరాజనాలు సమర్పించారు. బుజ్జమ్మతోటలో విడిది చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డబ్బుగుంట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆదివారం భోగి పండుగ సందర్భంగా ఉదయం 9 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామిలకు తిరుమంజనం జరుగుతుందని తెలిపారు. సాయంత్రం 6గంటలకు భోగి కల్యాణం సందర్భంగా ఎదురుకోలు ఉత్సవం, మాలలు మార్పు వేడుకలు అనంతరం గోదా కళ్యాణం జరుగుతుందని తెలిపారు. 15న మకర సంక్రాంతి సందర్భంగా ఉదయం 8.30గంటలకు శ్రీదేవి భూదేవి సమేత రంగనాథస్వామికి తిరుమంజనం సేవ అనంతరం పేట ఉత్సవాలు జరుగు తాయని తెలిపారు. 16న కనుమ పారువేట సందర్భంగా స్వామివారు నవాబుపేట తోటకు భక్తుల కోసం వెళతారని తెలిపారు. ఈ ఉత్సవాల్లో భక్తులు అందరూ పాల్గొనాలని కోరారు.

18 నుంచి సైరెడ్‌లో ఉచిత ఉపాధి శిక్షణ కోర్సులు

వెంకటాచలం, జనవరి 13 : స్థానిక స్వర్ణభారత్ ట్రస్టు ఆవరణలో నిర్వహిస్తున్న సైరెడ్‌లో ఈనెల 18వ తేదీ నుంచి ఉచిత ఉపాధి శిక్షణా కోర్సులు ప్రారంభించనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఎం కాశయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెల్‌ఫోన్ రిపేరింగ్, రిఫ్రిజరేషన్, ఎయిర్ కండిషనింగ్, సీసీ టీవీ ఇన్స్టాలేషన్ సర్వీసింగ్ కోర్సుల్లో పురుషులకు ఉచితంగా శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. 18 సంవత్సరాలు పూర్తయి 45 సంవత్సరాల లోపు ఉండాలని, తెలుగు చదవడం, రాయడం వచ్చి ఉండాలన్నారు. కోర్సు కాలపరిమితి 30 రోజులు అని, శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం ఉంటుందన్నారు. కోర్సులలో చేరాలనుకునే వారు 4 పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, రేషన్, ఆధార్ కార్డు జెరాక్స్ కాపీలను తీసుకొని స్వర్ణభారత్ ట్రస్ట్ ఆవరణలో ఉన్న సైరెడ్ కార్యాలయానికి రావాలని సూచించారు. ఆసక్తి కలిగిన వారు 8096220239, 8247785086, 9491694560 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

పొదలకూరు, జనవరి 13 : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్వగ్రామమైన మండలంలోని తోడేరు గ్రామస్థులకు కాకాణి కుమార్తె పూజిత శనివారం దుస్తులు పంపిణీ చేశారు. తోడేరు అరుంధతీయవాడ, రత్నగిరి, శాంతినగర్‌లోని పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తోడేరు సర్పంచ్ అలుపూరు పెంచలమ్మ, ఎంపీటీసీ స్వర్ణ సుగుణమ్మ, మాజీ ఎంపీటీసీ ఏనుగు శశిధర్‌రెడ్డి, పొదలకూరు వార్డు మెంబర్ షేక్ అంజాద్, తదితరులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట: మండలంలోని పొన్నూరులో స్వర్గీయ పొన్నెబోయిన చెంచురామయ్య భార్య వచ్చలమ్మ జ్ఞాపకార్థం 100 గిరిజన కుటుంబాలకు పొన్నెబోయిన చెంచుకిషోర్‌యాదవ్-లక్ష్మీ దంపతులు శనివారం దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలబొమ్మ వెంకటశేషయ్య, చిట్టిబోయిన వేణు, తిరగాల శ్రీనివాసులు, ఉడతా సుమన్, బీ కిషోర్, ముంగర సుబ్రహ్మణ్యం, పొట్లూరు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబులు..

మనుబోలు, జనవరి 13: ప్రభుత్వం అందించిన ట్యాబులను విద్యార్థులు జాగ్రత్తగా వినియోగించుకోవాలని మనుబోలు పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ మారంరెడ్డి ప్రదీప్‌కుమార్‌రెడ్డి సూచించారు. మండలంలోని మడమనూరు ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు ఆయన ట్యాబులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శేషాద్రివాసు, ప్రధానోపాధ్యాయులు వివి రాధాకృష్ణ, పీఎంసీ కమిటీ ఛైర్మన్ గుమ్మా నరేష్, వైసీపీ నాయకులు కొండూరు రామచంద్రారెడ్డి, సీఆర్పీ చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాలతో రైతులకు మేలు : మంత్రి కాకాణి

తోటపల్లిగూడూరు, జనవరి 13 : రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు మేలు జరుగుతుందని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని తోటపల్లి పంచాయతీలో సీసీరోడ్లు, రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పల శంకరయ్యగౌడ్, ఈదూరు రామాచార్యులు, చిలుకూరు సుధీర్‌రెడ్డి, మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్, మన్యం చిరంజీవిగౌడ్, ఎంబేటి శేషమ్మ, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గంధం రమేష్ మృతికి కారణమైన వారిపై కేసు నమోదు చేయాలి

● పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యుల ఫిర్యాదు



పోలీస్‌స్టేషన్ ముందు ఫిర్యాదు చూపుతూ మాట్లాడుతున్న విజయరాజు

పొదలకూరు, జనవరి 13: ఆర్ఎంపీ డాక్టర్ అందించిన వైద్యం వికటించడం వల్లే మండలంలోని మరుపూరు గ్రామానికి చెందిన టీడీపీ దళిత నేత, తెలుగునాడు ట్రేడ్ యూనియన్ నాయకుడు గంధం రమేష్ మృతి చెందాడని బ్లూవింగ్స్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి విజయరాజు ఆరోపించారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గంధం రమేష్ కుటుంబసభ్యులతో కలిసి ఆర్ఎంపీ వైద్యునిపై ఫిర్యాదు చేశారు. రమేష్‌కు కిడ్నీకి సంబంధించిన వ్యాధులు ఏమీలేవని, ఒక్కసారిగా రెండు కిడ్నీలు ఫెయిల్ అవ్వడం, లివర్, బాడీ మొత్తం ఇన్‌ఫెక్షన్ కావడం వలన చనిపోవడం డాక్టర్లు కూడా సమరిలో తెలిపి ఉన్నారన్నారు. తగిన ఆధారాలతో ఆర్ఎంపీ డాక్టర్‌పై ఫిర్యాదు చేశామని, మెడికల్ హిస్టరీ రిపోర్టులో డ్రగ్ ఇంజురీ వల్ల గంధం రమేష్ మృతిచెందాడని క్లియర్‌గా ఉందన్నారు. దీనిపై తాము నిజనిర్ధారణ కమిటీగా వెళ్లి వివరాలు కూడా సేకరించామన్నారు. వెంటనే రమేష్ మృతికి కారణమైన వారిపై హత్య, ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు చేయాలని, లేనిపక్షంలో తాము న్యాయస్థానాలను ఆశ్రయించి, సమస్య పరిష్కారం అయ్యే వరకు ఉద్యమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జమీర్, సురేష్‌బాబు, మహేష్, నారాయణ, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నృసింహుడి కల్యాణం



నృసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు(డక్కిలి), జనవరి 13 : పెంచలకోన ఆలయంలో చెంచులక్ష్మీ, ఆదిలక్ష్మీ సమేత నృసింహస్వామి కల్యాణం శనివారం అర్చకుల వేదమంత్రాలు, మంగళవాద్యాల నడుమ అత్యంత వైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి కల్యాణంలో పాల్గొన్నారు. అనంతరం స్వామి వారికి భక్తులు కల్యాణ చదివింపులు అందచేశారు. సాయంత్రం స్వామివారికి తిరుచ్చి పల్లకీసేవ, సహస్ర దీపాలంకరణ వంటి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. కాగా, ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సహాయ కమిషనర్ కె జనార్దనరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి నిత్యాన్నదాన పథకానికి కడపకు చెందిన ఇడెం హరిబాబు, రాజేశ్వర్లు రూ. 1,00,116 విరాళం అందచేశారు. వీరికి సహాయ కమిషనర్ కె జనార్దనరెడ్డి స్వామివారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందచేశారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు : సీఐ

పొదలకూరు, జనవరి 13: పొద లకూరు సర్కిల్ పరిధిలో కోడి పందే లు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పొదలకూరు సీఐ రాంబాబు హెచ్చ రించారు. శనివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో పొదలకూరు ఎస్ఐ మస్తానయ్యతో కలిసి ఆయన మాట్లా డుతూ ఎక్కడైనా కోడి పందాలు, జూదం, నాటుసారా కాయడం, అమ్మ డం, తదితర కార్యకలాపాలను నిర్వహిస్తున్నట్లు తెలిస్తే 94407 00006, 9440700007 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారాన్ని తెలపాలని కోరారు. వీటిపై తీసిన ఛాయా చిత్రాలు, వీడియోలను ఈ నెంబర్లకు వాట్సప్ ద్వారా పంపాలన్నారు. సెలవులకు ఊర్లకు వెళ్లే వారి సమాచారం ఇస్తే ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు.

ఓటమి భయంతోనే వైసీపీ కుతంత్రాలు

కొడవలూరు: ఓటమి భయంతో వైసీపీ కుతంత్రాలు చేస్తున్నదని, ప్రజలు ఎప్పటికీ ఆ పార్టీని నమ్మరని టీడీపీ, జనసేన నాయకులు అన్నారు. మండలం లోని నార్తురాజుపాలెంలో ఉన్న పీఎస్ఆర్ కల్యాణ మండపంలో శనివారం జరిగిన విలేకర్ల సమావేశం వారు మాట్లాడారు. కోవూరు నియోజకవర్గంలో కొనసాగుతున్న జనసేన, టీడీపీ మైత్రిని వైసీపీ ఏమిచేయలేదన్నారు. నియోజకవర్గంలో ఇసుక, గ్రావెల్, మట్టి మాఫియాలను అడ్డు పెట్టుకొని వచ్చిన సొమ్ముతో బెంగళూరులో విలాసాలు అనుభవిస్తున్నవారు ఎవరో ప్రజలకు బాగా తెలుసన్నారు. రాష్ట్ర భవిష్యత్, నియోజకవర్గ అభివృద్ధి కోసం కలసి పనిచేసి విజయం సాధిస్తామన్నారు. సమావేశంలో టీడీపీ, జనసేన నాయకులు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, చెముకుల చైతన్య, మాతూరి శ్రీనివాసులురెడ్డి, గుడి హరికుమార్‌రెడ్డి, చప్పిడి శ్రీనివాసులురెడ్డి, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబం అదృశ్యం

నెల్లూరు(క్రైం) : ఇద్దరు పిల్లలతో కలిసి దంపతులు అదృశ్యమైన ఘటనపై బాలాజీనగర్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. చిల్డ్రన్స్ పార్కు సాయిబాబాగుడి ఎదురు వీధిలో కె.మనోహర్, సుజిత దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి మధుహాస్య, అనఘదత్తసాయి పిల్లలు ఉన్నారు. మనోహర్ బిట్‌కాయిన్‌కు డబ్బులు పెట్టి నష్టపోయి అప్పులపాలయ్యారు. అప్పుల బాధలు తాళలేక తన భార్య, పిల్లలతో కలిసి ఇంటికి తాళం వేసి ఎటో వెళ్లిపోయారు. ఈ నెల 12వ తేదీన కొడవలూరు మండలం గండవరంలో ఉంటున్న మనోహర్ తండ్రి పెద్దపుల్లయ్య కుమారుడు ఇంటికి వచ్చారు. ఇంటికి తాళాలు వేసి ఉండటం, ఫోన్లు పనిచేయకపోవడంతో వారి కోసం గాలింపు చేపట్టారు. జాడ తెలియక పోవడంతో శనివారం రాత్రి బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ మహబూబ్ సుభాని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి అదృశ్యం : పద్మావతినగర్‌లో నివాసం ఉంటున్న మాలకొండయ్య ఈనెల 11న ఇంట్లో గొడవపడి వెళ్లిపోయారు. బాధిత కుటుంబసభ్యులు అతని కోసం గాలించినా ఆచూకీ తెలియలేదు.దీంతోవారు శనివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ అభ్యర్థుల ఎంపిక



ఎంపికైన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు

పొదలకూరు, జనవరి 13 : జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను శనివారం ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఎంపిక చేశారు. పట్టణంలోని స్థానిక నాగార్జున స్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. సర్వేపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పొదలకూరుకి చెందిన చింతగింజల చిన్నసుబ్రహ్మణ్యం, నెల్లూరుజిల్లా పార్లమెంటు నియోజకవర్గం అభ్యర్థిగా నక్క శీనయ్య, సాగర్, నెల్లూరు సిటీ అభ్యర్థిగా బుధవరపు బాలాజీ, నెల్లూరు రూరల్ అభ్యర్థిగా వింజమూరు మస్తాన్‌బాబు, కోవూరు అభ్యర్థిగా దోనేపూడి శివపూజిత, ఆత్మకూరు నియోజకవర్గ అభ్యర్థిగా సయ్యద్‌బాషాను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కోటేశ్వరరావు, ఏ జనార్ధన్, చెంచురామయ్య, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎస్ఐ గంటా అజయ్‌కుమార్

మనుబోలు, జనవరి 13: స్థానిక ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సందర్భంగా బొమ్మిరెడ్డి పార్థురెడ్డి మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ఎస్ఐ గంటా అజయ్‌కుమార్ ప్రారంభించారు. టోర్నమెంట్‌ను తన తాత వెంకురెడ్డి, నానమ్మ వనజా క్షమ్మ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్నట్లు పార్థీశ్వర్‌రెడ్డి తెలిపారు. విజేత జట్టుకు రూ. 20వేలు, రన్నర్ జట్టుకు రూ. 10వేలు నగదు బహుమతి ఇస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ముందుగా మడమనూరు జట్టు మనుబోలు యూత్ జట్టుతో పోటీకి దిగింది. మడమ నూరు జట్టు నిర్ణీత 10 ఓవర్లకు 97 పరుగులు చేయగా, మనుబోలు యూత్ జట్టు 46పరుగులు చేసి ఓటమి పాలైంది. తరువాత మనుబోలు మెయిన్ జట్టు ఎల్ఎస్ పురం అంకమ్మతల్లి జట్టుతో తలపడింది. అంకమ్మ తల్లి జట్టు 48 పరుగులు చేయగా, మనుబోలు మెయిన్ జట్టు 50 పరుగులు చేసి విజయం సాధించింది. అనంతరం ఎమ్మార్వో కార్యాలయం స్టాఫ్ జట్టు యాచవరం జట్టుతో ఆడగా, యాచవరం జట్టు గెలుపొందింది. అనంతరం స్టార్ 11జట్టు కట్టువపల్లి జట్టుతో రంగంలోకి దిగగా కట్టువపల్లి జట్టు నెగ్గినట్లు ఆర్గనైజర్లు సాయికుమార్, అజయ్, శశి, గిరీష్, చైతన్యలు తెలిపారు.

అధ్యాపకుల నియామకానికి చర్యలు చేపట్టాలి

వెంకటాచలం, జనవరి 13: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, ట్రిపుల్ ఐటీలలో అధ్యాపకుల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలని ఏబీఆర్ఎస్ఎం (అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహాసంగ్) రాష్ట్ర అధ్యక్షుడు వైవీ రామిరెడ్డి శనివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే కోర్టులో ఉన్న కేసుల అడ్డంకులు తొలగించుకొని పరీక్షలు నిర్వహించి అధ్యాపకుల నియామకాలు చేపట్టాలన్నారు.

వైసీపీని ఇంటికి పంపడమే లక్ష్యం

● మాజీ మంత్రి పొంగూరు నారాయణ



చిరువ్యాపారికి తోపుడు బండి అందజేస్తున్న నారాయణ

నెల్లూరు(వైద్యం), జనవరి 13 : రాబోయే ఎన్నికల్లో వైసీపీని ఇంటికి పంపడమే లక్ష్యంగా మనం పనిచేయాలని టీడీపీ శ్రేణులకు మాజీ మంత్రి, సిటీ ఇన్‌చార్జి పొంగూరు నారాయణ పిలుపు నిచ్చారు. శనివారం నారాయణ మెడికల్ కాలేజీలోని క్యాంపు కార్యాలయంలో ఆయన టీడీపీ ముఖ్య నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ ఎన్నికలకు తక్కువ రోజులు ఉన్నందున ప్రతి ఒక్కరు టడీపీ గెలుపు కోసం కష్టపడి పనిచేయాలని సూచించారు. వైసీపీ అరాచకాలు, వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు ప్రారంభమయిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ తాళ్లపాక అనూరాధ, ముప్పాళ్ల విజేత, నారాయణ విద్యాసంస్థల జీఎం విజయభాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు తోపుడు బండి, దుస్తుల పంపిణీ

నగరంలోని 4, 50వ డివిజన్‌లలోని బుజ్జమ్మరేవు, పొర్లుకట్ట, దీనదయాళ్‌నగర్ తదితర ప్రాంతాలలో బాబుష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో నారాయణ ఇంటింటికి తిరిగారు. ఈ సందర్భంగా చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు, పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. నెల్లూరు ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

వాత్సల్య అనాథ శరణాలయానికి డాక్టర్ దంపతుల విరాళం



సాంబశివరావుకు చెక్కు అందచేస్తున్న డాక్టర్ దంపతులు కోటేశ్వరరావు, లక్ష్మి

నెల్లూరు(హరనాథపురం), జనవరి 13: నగరంలోని జనహిత-వాత్సల్య అనాథ శరణాలయానికి ప్రముఖ ఫిజిషియన్ డాక్టర్ టీవీకోటేశ్వరరావు, ఆయన శ్రీమతి అయిన రెడ్‌క్రాస్ కేన్సర్ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ టీ.లక్ష్మి రూ.1.08 లక్షల విరాళాన్ని అందచేశారు. శనివారం డాక్టర్ కోటేశ్వరరావు పుట్టిన రోజు సందర్భంగా ఈ విరాళాన్ని చెక్కు రూపంలో జనహిత-వాత్సల్య ఆర్గనైజింగ్ కార్యదర్శి జీవీ సాంబశివరావుకు అందచేశారు.

నిత్యావసరాల పంపిణీ : వాత్సల్య అనాథ శరణాలయానికి ఏపీఎన్జీఓ సంఘం ఉపాధ్యక్షుడు నందిమండలం అంజనేయవర్మ తన కుమారుడు రాజానితిన్ పుట్టిన రోజును పురస్కరించుకుని శనివారం నిత్యావసర వస్తువులను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏపీజీఈఎఫ్ జిల్లా ఛైర్మన్ చేజర్ల సుధాకర్‌రావు, ఏపీఎన్‌జీఓ అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు, వాత్సల్య ఆర్గనైజింగ్ కార్యదర్శి జీవీ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా ముగ్గుల పోటీ



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 13: జనసేన పార్టీ నగర నాయకుడు వేములపాటి అజయ్ కుమార్ ఆధ్వ ర్యంలో నగరంలోని వీఆర్సీ మైదానంలో శనివారం మన ఊరు మన ఆట కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీలు కోలా హలంగా జరిగాయి. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన మహిళలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భం గా జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ మాట్లాడుతూ సంప్రదాయాలను, సంస్కృతిని కాపాడడం జనసేన పార్టీ ముఖ్యమైన ఏడు సిద్ధాంతాల్లో ఒకట్టన్నారు. ఈ కార్యక్రమంలో గునుకుల కిషోర్ సతీమణి గునుకుల విజయలక్ష్మి, జనసేన వీరమహిళలు హైమావతి, కృష్ణవేణి, హసీనా, ప్రవల్లిక, సుజా, సుభాషిణి, నాయకులు ఏటూరి రవికుమార్, కృష్ణారెడ్డి, హరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెల్లంటిలో అయోధ్య అక్షితల పంపిణీ

నెల్లూరురూరల్, జనవరి 13 : మండలంలోని కొత్తవెల్లంటిలో శనివారం అయోధ్య నుంచి వచ్చిన అక్షితలను ప్రజలకు పంపిణీ చేశారు. రామాలయం ఉన్న గ్రామాలకు అయోధ్య నుంచి పంపిన అక్షితలతో పాటు కరపత్రాలను ప్రజలకు అందచేశారు. జై శ్రీరాం అంటూ నినాదాలు చేస్తూ ఇంటింటికి వెళ్లి వీటిని అందచేశారు. ఈ నెల 22వ తేదీన అయోధ్య రామమందిరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రత్యేక కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొనాలని కోరారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ



గ్యాస్ కనెక్షన్‌లు అందిస్తున్న యశ్వంత్‌సింగ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 13: ఉజ్వల గ్యాస్ పథకం ద్వారా నగరంలోని చిన్నబజార్ కార్యాలయంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ ఆధ్వర్యంలో శనివారం 12 మందికి ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు అందించారు. ఈ సందర్భంగా యశ్వంత్‌సింగ్ మాట్లాడుతూ ఉజ్వల గ్యాస్ కనెక్షన్ భారత దేశం మొత్తం సుమారు 10 కోట్ల లబ్ధిదారులకి ఇచ్చారన్నారు. అలాగే నగరంలోని రాజేంద్రనగర్‌లో సంక్రాంతి పండుగ సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గులు పోటీలలో విజేతలకు యశ్వంత్‌సింగ్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కార్తీక్, చెంగమ్మ, పెంచలయ్య, సాయికుమార్ పాల్గొన్నారు.

అందరూ సంతోషంగా ఉండడమే పండుగ



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ముక్కాల



రమేష్‌రెడ్డి నగర్‌లో భోగి మంట

నెల్లూరు (సాంస్కృతికం) : అందరూ సంతోషంగా ఉండడమే పండుగ అని నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ తెలిపారు. శనివారం నవాబుపేట ఏబీఎస్ కల్యాణ మండపంలో నెల్లూరు అర్బన్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి కానుకగా ఆయన ఆర్యవైశ్య పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం నిర్వహించిన అర్బన్ ఆర్యవైశ్య సంఘం నాయకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పీర్ల సీతారామ్, కోట సూర్యనారాయణ, భైసాని జ్యోతిప్రసాద్, శ్రీరామ్‌సురేష్, తదితరులు పాల్గొన్నారు. కాగా, రమేష్‌రెడ్డి నగర్‌లో స్థానికులు భోగిమంటలు వేశారు.

రేపు రంగవల్లుల పోటీ

నెల్లూరు(సాంస్కృతికం), జనవరి 13 : సంక్రాంతి పర్వదినం సందర్భంగా వాసవీ క్లబ్ సిటీ ఆధ్వర్యంలో 15వ తేదీ సోమవారం మహిళలకు రంగవల్లుల పోటీ నిర్వహిస్తున్నట్లు ఆ క్లబ్ అధ్యక్షుడు పాదర్తి బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు నవాబుపేట పెద్ద పత్తివారి హైస్కూల్ ఎదురుగా డబ్బాల వెంకయ్య సందులో మధ్యాహ్నం 3గంటలకు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు 98493 96644, 95427 23338, 94402 67232 ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

రామనారాయణరెడ్డితో కోటంరెడ్డి భేటీ



రామనారాయణరెడ్డిని కలిసిన శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 13: నగరంలోని సంతపేటలో వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి నివాసానికి శనివారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వెళ్లారు. ఆయనకు రామనారాయణ రెడ్డి ఆప్యాయంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజకీయ అంశాలపై 45 నిమిషాల పాటు ఇరువురు నేతలు చర్చించారు. టీడీపీ-జనసేన విజయమే లక్ష్యంగా పనిచేయాలని నిర్ణయించుకున్నామని, ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పదికి పది స్థానాల్లో విజయం సాధించేలా క్రియాశీలకంగా పని చేయాలని నిర్ణయించుకున్నామని ఇరువురు నేతలు తెలిపారు. ఇరువురు నేతలు భేటీ కావడం జిల్లాలో చర్చాంశనీయమైంది.

నేడు మకర విళక్కు

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 13 : నగరంలోని అయ్యప్పగుడిలో ఉన్న గురువాయురప్పన్ మహావిష్ణు ఆలయంలో ఉదయం 9గంటలకు గోదా కల్యాణం జరుగుతుందని ఆలయ పాలక మండలి కార్యదర్శి కెవి.రత్నం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే సాయంత్రం 6గంటలకు శబరిమలలో మకరజ్యోతి సందర్భంగా అయ్యప్ప ఆలయంలో మకర జ్యోతిని వెలిగిస్తామని తెలిపారు. ఈ రెండు కార్యక్రమాలకు భక్తులు అందరూ తరలిరావాలని కోరారు.

చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ బాధ్యతల స్వీకరణ



ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్

నెల్లూరు(క్రైం), జనవరి 13: నగరంలోని చిన్నబజారు పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బీ అశోక్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన జిల్లా ఎస్పీ డాక్టర్ కె తిరుమలేశ్వరరెడ్డి, ఏఎస్పీలు, నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. అశోక్‌కుమార్ గతంలో చిన్నబజారు ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ పల్నాడు జిల్లా చిలకలూరిపేట రూరల్ సీఐగా బదిలీపై వెళ్లారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయన తిరిగి చిన్నబజారు ఇన్‌స్పెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ పండుగ సందర్భంగా కోడి పందేలు, పేకాట, అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన వీపీఆర్




బాధితులకు చెక్కు అందజేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(సాంస్కృతికం), జనవరి 13: అల్లూరు మండలం వెస్ట్ గోగులపల్లికి చెందిన దాసరి సాయికుమార్ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.80 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును బాలుడి తండ్రి దాసరి గోపాల్‌కు రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అందజేశారు. వివరాల మేరకు.. వెస్ట్ గోగులపల్లికి చెందిన దాసరి సాయికుమార్ అనే బాలుడు ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని ఎంపీ, సీఎం దృష్టికి తీసుకెళ్లగా రూ.80వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును విడుదల చేశారు. ఆ నిధులకు సంబంధించిన చెక్కును వేమిరెడ్డి తన నివాసంలో తన సోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డి ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పుచ్చ లపల్లి నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నెల్లూరు(హరనాథపురం): పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్‌ను రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి శనివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు హనోక్, ప్రధాన కార్యదర్శి ఎ. రమేష్, ట్రెజరర్ కిషోర్ కుమార్, ఉపాధ్యక్షులు కెఎస్‌రాజు, సదారావు, జాషువా తదితరులు పాల్గొన్నారు.











తిరుపతి నెహ్రూ హైస్కూల్ మైదానంలో ఎగురవేస్తున్న పతంగులు - కోళ్ల పందేల్లో నాయకులు - తిరుచానూరు శిల్పారామంలో భోగిమంటలు

తిరుపతిలో పండుగ సామాగ్రి కొనుగోలుదారులతో కిక్కిరిసిన గాంధీరోడ్డు

సంక్రాంతి సందడి

సంక్రాంతి సందడి శనివారమే ప్రారంభమైంది. తిరుపతిలో వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాల మైదానంలో పిల్లలూపెద్దలు పతంగులు ఎగుర వేశారు. కోడి పందేలు, బొంగరాలు, గోలీలు, కర్రసాము వంటి పల్లె ఆటల్లో ఓలలాడారు.తిరుచానూరు సమీపంలోని శిల్పారామంతో పాటు పలు ప్రాంతాల్లో శనివారం సాయంత్రమే భోగిమంటలు వేసి సరదాగా గడిపారు.పండుగ సామాగ్రి కొనుగోళ్లతో బజార్లన్నీ కిక్కిరిసాయి.



తిరుపతిలోని దీక్షా శిబిరం వద్ద ఎస్మా ప్రతుల దహనం

భోగి మంటల్లో ఎస్మా ప్రతుల దహనం

పలుచోట్ల అంగన్వాడీ కార్యకర్తల నిరసన

తిరుపతి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : సమ్మె విరమించమంటూ బెదిరించడమే కాకుండా ఎస్మా చట్టం ప్రయోగించడంపై అంగన్వాడీలు మండిపడ్డారు.శనివారం జిల్లాలో పలుచోట్ల భోగిమంటలు వేసి ప్రభుత్వ ప్రతులను దహనం చేశారు. తిరుపతిలోని దీక్షా శిబిరంలో సంక్రాంతి ముగ్గులను వేసి, ముగ్గుల మధ్యలో భోగిని పేర్చి నిప్పుపెట్టారు. అందులో ఎస్మా ప్రతులను వేసి దహనం చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ అంగన్వాడీల సహనానికి జగన్ రెడ్డి పరీక్ష పెడుతున్నారని, చర్చల పేరుతో పిలిచి సమస్యలను పరిష్కరించకుండా అవమానిస్తున్నారని మండిపడ్డారు. అంగన్వాడీ కేంద్రాల పరిధిలో కోటి సంతకాల సేకరణ చేపట్టనున్నామని, రాబోయే రోజుల్లో ప్రత్యక్ష పోరాటాల్లోకి దిగుతామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు సుబ్రమణ్యం, వేణుగోపాల్, ఆర్టీసీ కార్మిక నాయకులు కుమార్, సత్యనారాయణ తదితరులు అంగన్వాడీలకు మద్దతుగా నిలిచారు. శ్రీకాళహస్తి, గూడూరు, కోట, వెంకటగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట, పిచ్చాటూరు, సత్యవేడుల్లో దీక్షాశిబిరాల వద్ద భోగిమంటల్లో ఎస్మా ప్రతులు దగ్ధం చేసి, గొబ్బి పాటలు పాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు నిరసన తెలిపారు. పుత్తూరులో సమ్మె 33వ రోజుకు చేరుకోవడంతో 33 ఆకారంలో కూర్చుని నిరసన తెలిపారు.

నేడు స్వగ్రామానికి చంద్రబాబు, లోకేష్

చంద్రగిరి, జనవరి 13 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు, చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి లోకేష్ ఆదివారం స్వగ్రామమైన నారావారిపల్లెకు రానున్నారు.ప్రతి ఏడాదిలాగే రెండురోజులు ఇక్కడే వుండి సంక్రాంతి పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకోనున్నారు. శుక్రవారమే చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, ఆమె సోదరి లోకేశ్వరి, బంధువులు కంఠమనేని శ్రీనివాస్, శ్రీనివాస్ తదితరులు నారావారిపల్లెకు చేరుకోగా శనివారం చంద్రబాబు మనవడు నారా దేవాన్ష్, సినీనటుడు నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర, సోదరుడు నందమూరి రామకృష్ణ, చిన్న కుమార్తె తేజస్విని, నారా రామ్మూర్తి నాయుడి సతీమణి ఇందిర శనివారం మధ్యాహ్నం నారావారిపల్లెకు చేరుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 12.30 గంటలకు ఎ.రంగంపేటలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో చంద్రబాబు దిగుతారు. అక్కడినుంచి స్వగృహానికి చేరుకొంటాడు. సాయంత్రం లోకేష్, ఆయన సతీమణి బ్రాహ్మణిలు రానున్నారు. సోమవారం ఉదయం సినీనటుడు నారా రోహిత్ రానున్నారు.సంక్రాంతి పండుగకు ప్రముఖులు రానుండడంతో గ్రామంలో ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి.చంద్రబాబుకు స్వాగతం పలుకుతూ టీడీపీ నాయకులు భారీ ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆదివారం క్రీడాపోటీలు,ముగ్గుల పోటీలు నిర్వహించడానికి మైదానాన్ని సిద్ధం చేశారు.చంద్రబాబు తల్లిదండ్రుల సమాధుల వద్ద, కులదైవం నాగాలమ్మ ఆలయం వద్ద, గ్రామ దేవత దొడ్డి గంగమ్మ ఆలయం వద్ద పూజలకోసం పరిసరాలను శుభ్రం చేశారు.

ఎన్నికల బదిలీల కసరత్తు దాదాపు పూర్తి

పొరుగు జిల్లాలకు వెళ్లనున్న 60 మంది ఎంపీడీవోలు, 22 మంది తహసీల్దార్లు

రాష్ట్ర కార్యాలయాలకు వెళ్లిన జాబితాలు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 13: సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈ ప్రక్రియతో ప్రమేయమున్న అధికారుల బదిలీలకు సంబంధించిన కసరత్తు 95శాతం పూర్తయింది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మూడేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న జిల్లా, మండల అధికారులతోపాటు సొంత జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న వారిని బదిలీ చేయనున్నారు.ఎంపీడీవోలకు సంబంధించి ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన జడ్పీ కార్యాలయంలో, తహసీల్దార్లకు సంబంధించి కొత్త జిల్లాల ప్రాతిపదికన కలెక్టరేట్‌లో కసరత్తు పూర్తిచేసి జాబితాలను రాష్ట్ర కార్యాలయాలకు నివేదించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 65మంది ఎంపీడీవోల్లో ఫిబ్రవరి నుంచి జూన్ నెలాఖరులోగా ఐదుగురు ఉద్యోగ విరమణ చేయనున్నారు.అందుకని వీరికి బదిలీల నుంచి మినహాయింపు లభించనుంది. మిగిలిన 60మంది ఎంపీడీవోలు ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరించి పొరుగు జిల్లాలకు వెళ్లనున్నారు. ఈ వివరాలను రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ కమిషనరేట్‌కు పంపినట్లు తెలిసింది.

విశాఖ చేరిన ఇండిగో ప్రయాణికులు

రేణిగుంట, జనవరి 13: తిరుపతి విమానాశ్రయంలో శుక్రవారం సాయంత్రం విమానం రద్దు కావడంతో ఆందోళన చెందిన విశాఖ ప్రయాణికులకు శనివారం ఉద యం ఇండిగో యాజమాన్యం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది.శుక్రవారం తిరుమల శ్రీవారి దర్శనం ముగించుకున్న విశాఖపట్నం ప్రాంతానికి చెందిన 26 మంది ప్రయాణికులు సాయంత్రం తిరిగి వెళ్లేందుకు తిరుపతి విమానాశ్రయం చేరుకున్నారు.అయితే గంటలకొద్దీ వేచివున్నాక ఇండిగో యాజమాన్యం విమాన సర్వీసు రద్దు చేయడంతో వారు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. తమకు వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆందోళనకు దిగారు.చివరకు శనివారం ఉదయం 9.50 గంటలకు ఇండిగో యాజమాన్యం విమానం ఏర్పాటు చేసి వారిని విశాఖ పంపింది.

చిరుత దాడిలో లేగదూడల హతం

ఐరాల, జనవరి 13: ఐరాలకు కూతవేటు దూరంలోని నగరిలో శనివారం వేకువ జామున రెండు లేగ దూడలను చిరుత పులి చంపేసింది. ఈడిగపల్లెకు చెందిన రెడ్డెప్ప తన పశువులను శుక్రవారం రాత్రి నగరిలోని తన మామిడి తోటలో కట్టేశాడు.శనివారం వేకువ జామున తోటలోకి చొరబడ్డ చిరుతపులి రెండు లేగ దూడలను చంపేసింది.ఇటీవల నగరికి సమీపంలోని తోకబండ వద్ద ఓ ఆవును చిరుత చంపేసిన విషయం తెలిసిందే.

దోపిడీ పాలనకు స్వస్తి పలకాలి: పాశం



పల్లెనిద్రలో పాశం సునీల్‌కుమార్

చిల్లకూరు, జనవరి 13: వైసీపీ దోపిడీ పాలనకు స్వస్తి పలకాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని కలవకొండ గ్రామంలో రెండోరోజు బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ అరాచకపాలపై ప్రజలకు అవగాహన కల్పించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రాభివృద్ధిని మరచి ఇసుక, సిలికా, గ్రావెల్ తదితర అక్రమ మైనింగ్ ద్వారా రాష్ట్రాన్ని దోచుకుంటున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమన్నారు. మినీ మేనిఫెస్టో ద్వారా అన్నివర్గాలకు సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం గ్రామంలో పల్లెనిద్ర చేశారు. కార్యక్రమంలో సన్నారెడ్డి వెంకటరమణారెడ్డి, గుండాల లీలావతి, వెంకటేశ్వర్లురెడ్డి, భాస్కర్‌రెడ్డి, నెల్లటూరు చిరంజీవి, సుప్రజ, కీరవాణి, ప్రవీణ్‌రెడ్డి, మునిశేఖర్ గౌడ్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే, డీఎస్పీ

గూడూరు, జనవరి 13: క్రీడల ద్వారా ఆరోగ్యం చేకూరుతుందని ఎమ్మెల్యే వరప్రసాదరావు అన్నారు. శనివారం స్థానిక ఏఆర్‌డీ ప్రభుత్వ స్టేడియంలో కనుమూరు హరిచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా క్రికెట్ లీగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణలో క్రీడలు ఎంతో దోహదపడుతాయన్నారు. మానసిక ఉల్లాసం పెరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని సంరక్షించుకునేందుకు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడంతో పాటు మంచి ఆహారపు అలవాట్లను, ఆరోగ్య సూత్రాలను పాటించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గతంలో గూడూరులో క్రికెట్ ఆడి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారందరినీ ఒక వేదిక మీదకు తీసుకువచ్చి సరదాగా గడిపేందుకు 14ఏళ్లుగా కనుమూరు హరిచంద్రారెడ్డి పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో మెలగాలన్నారు. కార్యక్రమంలో కనుమూరు హరిచంద్రారెడ్డి, వేగూరు రాజేంద్రప్రసాద్, నాగేశ్వరరావు, నూర్‌అహ్మద్, సుబ్రహ్మణ్యం, రజిని, మధు, రాజా, కలీం, లవకుమార్, మణి, మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె



సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు

వెంకటగిరి, జనవరి 13: మున్సిపల్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు చేస్తున్న సమ్మె శనివారం 11వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ దీపావళి పండుగ నాటి నుంచి ఇప్పటి వరకు తమకు జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నామని, సంక్రాంతికి జీతాలు ఇవ్వకుండా వేధించడం దుర్మార్గమన్నారు. వేతనాలు చెల్లించే వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కల్లూరి జాన్, ఈశ్వరయ్య, రాజేష్, చక్రవర్తి, శ్రీనివాసులు, నాగార్జున, నాగేశ్వరావు, వెంకటేశ్వర్లు, చంగల్‌రాయలు, సుబ్రహ్మణ్యం, చెంచురామయ్య, ప్రభాకర్, గంగయ్య, శ్రీనూ, తదితరులు ఉన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చిల్లకూరు, జనవరి 13: మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి శనివారం పూజలు జరిగాయి. ఉదయం అభిషేకాలు, రాత్రికి పల్లకీసేవ నిర్వహించారు. భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి నూతన సంవత్సర క్యాలెండర్లు ఆవిష్కరించారు. యరటపల్లి జానికిరామిరెడ్డి, సుబ్రమణ్యం, వెంకటేశ్వర్లు, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు

చిల్లకూరు, జనవరి 13: మండలంలోని చేడిమాల, తిప్పగుంటపాళెం, నల్లయ్యగారిపాళెం, తిక్కవరం, పారిచెర్లవారిపాళెం తదితర గ్రామాలకు చెందిన పేదలకు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చేడిమాల గ్రామంలో రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ రాజనేని శ్రీనివాసులు, శిరీష చేతుల మీదుగా శనివారం దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజనేని పిచ్చయ్యనాయుడు, రామయ్యనాయుడు, వెంకటేశ్వర్లు నాయుడు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

గూడూరు, జనవరి 13: మండలంలోని పోటుపాళెం గిరిజనకాలనీలో శనివారం సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. చీమల శ్రీనివాసులు, పారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జల్లికట్టు, కోడిపందేలకు అనుమతిలేదు: ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), జనవరి 13: జల్లికట్టు, కోడి పందేలు, పేకాట ఆడటం చట్ట వ్యతిరేకమని, సంక్రాంతి పండుగ సందర్భంగా వాటికి దూరంగా ఉండాలని ఎస్పీ పరమేశ్వరరెడ్డి అన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో అలాంటివి నిర్వహిస్తే 8099999977కు సమాచారం అందించాలని కోరారు. పండుగకు స్వస్థలాలకు వెళ్లే అవకాశం ఉన్నందున దొంగతనాలు జరిగే అవకాశాలున్నాయని, అలాంటి వారు ఇళ్లలో విలువైన బంగారు, వెండి నగలు, నగదు ఉంచరాదని సూచించారు. సంబంధిత పోలీసు స్టేషన్‌ను సంప్రదించి ఎల్‌హెచ్‌ఎంఎస్ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

47 మద్యం బాటిళ్ల స్వాధీనం

తడ, జనవరి 13: అక్రమంగా రవాణా చేస్తున్న 47 బాటిళ్ల మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భీములవారిపాళెం పోలీస్ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం రాత్రి పోలీసులు వాహనాలను తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో ఓ వ్యక్తి గోనె సంచితో వెళ్తుండడాన్ని గుర్తించి తనిఖీ చేశారు. అందులో 47 బాటిళ్ల మద్యం ఉండటాన్ని గుర్తించి స్వాధీనం చేసుకుని అతనిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు చిట్టమూరు మండలం చిల్లమూరు గ్రామానికి చెందిన సుబ్బయ్యగా గుర్తించి కేసు నమోదు చేశారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ఓజిలి, జనవరి 13: సంక్రాంతి, భోగి పండుగలను పురస్కరించుకుని కోడి పందేలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ ఆదిలక్ష్మి హెచ్చరించారు.

ధనుర్మాస పూజలు

కోట, జనవరి 13: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం ధనుర్మాస పూజలు జరిగాయి. గూడలిలోని జనార్థనస్వామి ఆలయంలో ప్రధానార్చకుడు ఉదయగిరి ఆదిశేషాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో భజనలు చేశారు. అదేవిధంగా గోవిందపల్లిలోని వెంకటేశ్వరస్వామి, నెల్లూరుపల్లి కొత్తపాళెంలోని ప్రసన్నవెంకటేశ్వరస్వామి, శ్రీలక్ష్మమ్మకాలనీలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ధనుర్మాస పూజలు, భక్తుల భజనలు జరిగాయి. దాతల సహకారంతో అన్నదానం జరిగింది.

గూడూరు నుంచి వెంకటగిరి రావాలంటే
ఒకటిన్నర గంట పడుతోంది

వైసీపీ పాలనపై సోమిరెడ్డి ఫైర్



సమావేశంలో మాట్లాడుతున్న సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

వెంకటగిరి, జనవరి 13: గూడూరు నుంచి వెంకటగిరి రావాలంటే ఒకటిన్నర గంట సమయం పడుతోందంటే ఈ ప్రభుత్వం బతికున్నట్లా చచ్చిపోయినట్లా అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ నివాసంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి రాష్ట్రంలో స్వీప్ చేస్తుందని జోస్యం చెప్పారు. దోపిడీకి పర్యాయ పదమైన జగన్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శించడం దెయ్యాలు వేదాలు వల్లించిన చందంగాఉందన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కలయికతో జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని, మతిభ్రమించి పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని అన్నారు. నాలుగున్నరేళ్లలో ల్యాండ్, మైన్, వైన్ నుంచి కనిపించిన ప్రతిదీ దోచేశారని ఆరోపించారు. టీడీపీ,జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైసీపీ నేతలు తిన్నదంతా కక్కిస్తామని హెచ్చరించారు. ల్యాండ్ టైటిల్ యాక్టు తీసుకు వచ్చింది వైసీపీ నాయకుల కోసమే తప్ప ప్రజలను ఉద్ధరించేందుకు కాదన్నారు. ఇంత దారుణమైన ప్రభుత్వాన్ని తన రాజకీయ చరిత్రలో చూడలేదని ఆవేదన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు గోడ దూకి పరారవుతున్నారంటే జగన్ నాలుగున్నరేళ్ల పాలన ఎలా ఉందో అర్థమవుతుందన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఈ నెల 19వ తేదీ వెంకటగిరిలో నిర్వహించనున్న రా.. కదలిరా.. బహిరంగ సభను కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతం చేస్తామన్నారు. ఒకటిన్నర లక్ష మంది జనసమీకరణ చేసే విషయమై తిరుపతి పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల ఇన్‌చార్జులు, ముఖ్య నేతలతో ఆయన సమీక్షించారు. అనంతరం వెంకటగిరి - తిరుపతి రోడ్డు మార్గంలో చంద్రబాబు సభ నిర్వహణకు నిర్ణయించిన స్థలాన్ని నాయకులతో కలిసి సోమిరెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గాల ఇన్‌చార్జులు కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్, బొజ్జల సుధీర్‌రెడ్డి, నెలవల సుబ్రహ్మణ్యం, సుగుణమ్మ, హేమలత, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు మాధవుల నాయుడు, తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్, ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు, జనసేన నాయకుడు తోట కృష్ణయ్య, టీడీపీ నాయకులు జన్నిరమణయ్య, పులికొల్లు రాజేశ్వరావు, పోలంరెడ్డి వెంకటరెడ్డి, మన్నారం చెంచయ్య, వలస రాఘవరెడ్డి, డక్కిలి చంద్రారెడ్డి, అవ్వారు సత్యనారాయణ, కాపా శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిరంకుశ, పెత్తందారీ పోకడలపై నిరసన గాలి: నెలవల



సమావేశంలో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట టౌన్, జనవరి 13: ముఖ్యమంత్రి జగన్ నిరంకుశ, పెత్తందారి పోకడలను వైసీపీ ఎమ్మెల్యేలే ఎండగడుతున్నారని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఐడీని అడ్డం పెట్టుకొని అక్రమ కేసులు బనాయిస్తూ, అరాచక పాలన సాగించిన జగన్ వైఖరితో అధికార పార్టీ ఎమ్మెల్యే విసిగిపోయారని, వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని గ్రహించిన వారు నిరసన గళం వినిపిస్తున్నారని అన్నారు. వైసీపీలో ఎస్సీలను, బీసీలను చీడపురుగుల్లా చూస్తున్నారని ఆ పార్టీ నేతలే బహిరంగంగా చెబుతున్నారంటే జగన్ వైఖరితో తెలుస్తోందన్నారు. దేశంలో ఇంతటి నేతగాడు ఎవరూ లేరని, 43వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడి, 38 కేసుల్లో నిందితుడైన వ్యక్తి మన సీఎంగా ఉండడం మన దౌర్భాగ్యమన్నారు. ముఖ్యమంత్రి హోదాలో న్యాయస్థానంలో వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకొని తిరుగుతున్న జగన్, 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబునాయుడుపై తప్పుడు కేసులు పెట్టి అక్రమంగా జైలుకు పంపడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం వచ్చే ఎన్నికల్లో టీడీని గెలిపించి చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అవధానం సుధీర్, మొండెం బాబు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, వాకిరి వెంకటేశ్వర్లు, మైలారి శ్రీనివాసులు, సుజాతమ్మ, లక్ష్మి, వెంకటసుబ్బయ్య, ముత్యాలయ్య, ప్రసాద్‌రాజు, గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.





గూడూరులో భోగిమంటల్లో ఎస్మా ప్రతులను దహనం - వెంకటగిరిలో గొబ్బియాలు ఆడుతున్న చేస్తున్న అంగన్వాడీలు

అంగన్వాడీలపై అణచివేత చర్యలు దారుణం

గూడూరు, జనవరి 13: న్యాయమైన తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీలు చేస్తున్న సమ్మెను అణచివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దారుణమని సీఐటీయూ నాయకులు అన్నారు. శనివారం స్థానిక గ్రామసేవకుల భవనం వద్ద అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మె 33వ రోజు శనివారం కొనసాగింది. దీక్షా శిబిరం వద్ద అంగన్వాడీలు భోగీమంటలు వేసి అందులో ఎస్మా చట్టం ప్రతులను తగలబెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని 33 రోజులుగా అంగన్వాడీలు ఆందోళన కార్యక్రమాలను చేస్తుంటే పట్టించుకోని ప్రభుత్వం బెదిరింపులకు దిగడం మంచి పద్ధతి కాదన్నారు. చర్చలతో కాలయాపన చేయకుండా అంగన్వాడీల డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఇంద్రావతి, ప్రభావతి, టీవీ.రమణయ్య, సురేష్, గోపీనాధ్, రమణయ్య, ప్రసాద్, చంద్రయ్య, పెంచలమ్మ, మునికుమారి, లక్ష్మి పాల్గొన్నారు.

వెంకటగిరి: పట్టణంలోని బంగారుపేట వద్ద ఉన్న ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న రిలే దీక్ష శనివారం 33వ రోజు కొనసాగింది. దీక్షా శిబిరం వద్ద భోగిమంటలు వేసి గొబ్బియాలు తడుతూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, స్వరూపారాణి, సుభాషిణి, మంజుల, ఐఎఫ్‌టీయూ నాయకులు మమ్ములాబేగం, లక్ష్మీప్రసన్న, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: పట్టణంలో 33 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలు శనివారం భోగిమంటలు వేసి జగనన్న ఉయ్యాలో అంటూ గొబ్బియాలపాటలు పాడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు ముకుంద మాట్లాడుతూ అంగన్వాడీలు ఇళ్లల్లో పండగ చేసుకోవాల్సి ఉండగా వైసీపీ ప్రభుత్వం పుణ్యమా అంటూ సమ్మె చేయాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి శ్యామలమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకురాలు పాల్గొన్నారు.

కోట: పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు నిరసన తెలిపారు. కార్యాలయం ఎదుట భోగి మంటలు వేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్వాడీ హెల్పర్లు, వర్కర్లకు రిజిస్టర్ పోస్టులో వచ్చిన షోకాజ్ నోటీసులను తిరస్కరించినట్లు అంగన్వాడీల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పద్మలీల తెలిపారు.

సూళ్లూరుపేట: స్థానిక హోలీక్రాస్ కూడలి వద్ద అంగన్వాడీలు ఆందోళన చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చర్చల పేరుతో పిలిచి కాలయాపన చేసి అవమానిస్తున్నారే తప్ప సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవచూపడం లేదని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్ యూనియన్ నాయకురాలు హైమావతి అన్నారు. ఇకనైన ప్రభుత్వం అంగన్వాడీల డిమాండ్లను పరిష్కరించాలన్నారు.





నాయుడుపేట, కోటలో భోగి మంటలు వేసి నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



మంచు దుప్పట్లో గూడూరు

గూడూరు, జనవరి 13: గూడూరు పట్టణంలో శనివారం ఉదయం పొగమంచు కురువడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉబ్బసం, ఆయాసంతో బాధపడేవారు అవస్థలు పడ్డారు. అయితే కొంతమంది చల్లని వాతావరణాన్ని ఆస్వాదించారు.

తిరుమలలో డ్రోన్ నిషేధంపై అవగాహన కల్పిస్తాం: టీటీడీ

తిరుమల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో డ్రోన్ వినియోగంపై ఉన్న నిషేధం గురించి భక్తులకు అవగాహన కల్పిస్తామని టీటీడీ సీవీఎస్వో నరసింహకిషోర్ తెలిపారు. తిరుమల ఘాట్ రోడ్డులో శుక్రవారం డ్రోన్ కెమెరాలో వీడియో తీస్తూ పట్టుబడిన హర్యానాకు చెందిన దినేష్‌ను పోలీసులు విచారిస్తున్నట్లు చెప్పారు. కెమెరాలో ఘాట్ రోడ్డు విజువల్స్ తప్ప తిరుమలలో ఎక్కడా వీడియో తీసినట్లు లేదన్నారు. ఆయన సెల్‌ఫోన్‌ను కూడా పరిశీలన చేశామన్నారు. ఆర్మీకి చెందిన దినేష్ చాలా బాధ్యత కలిగిన వ్యక్తి అన్నారు. ఆలయాల పర్యటనలో భాగంగా తిరుమలకు వచ్చిన ఆయన కొండలను తీసే ప్రయత్నం చేశారన్నారు. తిరుమలలో డ్రోన్ నిషేధం ఉన్న విషయం ఆయనకు తెలీదన్నారు. పైగా ఆ డ్రోన్ ప్లాస్టిక్‌ది కావడంతో అలిపిరిలో ఉన్న స్కానర్లు స్కాన్ చేయలేదన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

చిట్టమూరు, జనవరి 13: వివేక చారిటబుల్ ట్రస్టు వార్షికోత్సవం సందర్భంగా శనివారం పేద విద్యార్థులకు చేయూత నందిచారు. 12మంది విద్యార్థులకు ఐదు వేల రూపాయల చొప్పున నగదు వాకాడు సీఐ హరికృష్ణ చేతుల మీదుగా అందజేశారు. అదేవిధంగా 200 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు దువ్వూరు శేషురెడ్డి, టీఎంఆర్ విద్యాసంస్థ అధినేత మనోహర్ రెడ్డి, ఎస్‌ఐ గోపి, మల్లాం ఆలయ కమిటీ చేర్మన్ సాయికుమార్ రెడ్డి, ట్రస్టు అధ్యక్షుడు రహంతుల్లా చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో దాతలు శ్రీనివాసులు, పురుషోత్తం, విక్రమ్, మురగేష్, ఆశ శ్రీను, వినోద్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం

తిరుపతి (కల్చరల్), జనవరి 13: తిరుపతి జిల్లా రచయితల సంఘం (తిరసం) ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం యూత్ హాస్టల్లో నిర్వహించిన సంక్రాంతి కవి సమ్మేళనం అలరించింది. తిరసం అధ్యక్షుడు డాక్టర్ సాకం నాగరాజ అధ్యక్షతన జరిగిన సభలో ద్రవిడ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య కొలకలూరి మధుజ్యోతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తిరసం కార్యనిర్వాహక అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు సభానిర్వహణ చేశారు ప్రముఖ కవులు తమ కవితా గానంతో సభికులను అలరించారు. తిరసం కార్యనిర్వాహక అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు సభా నిర్వహణ చేశారు. బావుకబ్రహ్మ కలువగుంట రామమూర్తి కవితా విశ్లేషణ చేశారు.

అధికారుల గైర్హాజరుపై సభ్యుల ఆగ్రహం

వాకాడు, జనవరి 13: మండల కేంద్రంలో స్త్రీశక్తి భవనంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు పెద్ద సంఖ్యలో గైర్హాజరుకావడంతో ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి రాని అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ కారికేటి నిర్మల మాట్లాడుతూ ఇటీవల సంభవించిన తుఫాన్‌తో రోడ్లు, విద్యుత్ స్తంబబలు బాగా దెబ్బతిని ప్రజలు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టలేదని ఆయాశాఖల అధికారులను నిలదీశారు. సర్పంచుల సంఘం అధ్యక్షుడు దువ్వూరు విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ సచివాలయాల్లో వీఆర్వోలు అందుబాటులో ఉండటం లేదని ఫిర్యాదు చేశారు. తహసీల్దారు నరసింహరావు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు మండలం అతలాకుతలమైందని, సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. ముంపునకు గురైన పలు గ్రామాలకు విడతలవారీగా పరిహారాన్ని అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపీనాథ్, కొడవలూరు భక్తవత్సల్‌రెడ్డి, దువ్వూరు అజిత్‌రెడ్డి, వెంకటరమణయ్య, నాగభూషణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బావిలో దూకి యువకుడి ఆత్మహత్య



జనార్దన్ మృతదేహం

దొరవారిసత్రం, జనవరి 13: బావిలో దూకి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దొరవారిసత్రం మండలం అనేపూడి గ్రామంలో శనివారం జరిగింది. మండలంలోని వడ్డి కండ్రిగ గ్రామానికి చెందిన జనార్దన్(36) గత కొంతకాలంగా అనేపూడి గ్రామంలో నివాసం ఉంటున్నాడు. కుటుంబ కలహాలతో మనస్థాపం చెంది గ్రామ సమీపంలోని పొలాల్లో ఉన్న పాడుబడిన బావిలో దూకి ఆత్యహత్య చేసుకొన్నాడు. పశువుల కాపరి గుర్తించి స్థానికులకు తెలియజేశాడు. బంధువులు, గ్రామస్తులు బావిలో నుంచి మృతదేహాన్ని వెలికితీశారు.

కోటలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర

కోట, జనవరి 13: మండల కేంద్రమైన కోటలో శనివారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర జరిగింది. బీజేపీ నాయకులు సారంగం రమేష్‌బాబు, వెంకయ్యగౌడ్, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 2వ సచివాలయం పంచాయతీ కార్యదర్శి వెంకటరాజు పర్యవేక్షణలో సంకల్పయాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ప్రతినిధి కోలగట్ల వెంకటేశ్వర్లు, పలుశాఖల అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

గ్యాస్ కనెక్షన్ల పంపిణీ



గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేస్తున్న సర్పంచి సురేష్‌రెడ్డి

ఓజిలి, జనవరి 13: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుతన్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచు ఎల్లా సురేష్‌రెడ్డి కోరారు. ఓజిలి మండలం కరబల్లవోలు సచివాలయం ప్రాంగణంలో శనివారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర జరిగింది. ఉజ్వల పథకం కింది ఎంపికైన లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లు అందజేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ మోహన్, హౌసింగ్ వర్క్‌ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి రేణుక, బీజేపీ మండల కన్వీనరు ప్రసాద్, హెచ్‌పీ గ్యాస్ నిర్వాహకుడు మమ్మిడి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి, డీసీసీబీ చైర్మన్

పెళ్లకూరు, జనవరి 13: మండలంలోని చిల్లకూరు గ్రామంలో చింతంరెడ్డి గంగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ట్రస్టు చైర్మన్, ఎన్డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా, కామిరెడి రాజారెడ్డి, సర్పంచు పగడాల హరిబాబురెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ ఓబ్బు వెంకటరత్నం, నాయకులు కరణం రఘునాయుడు, వైస్ ఎంపీపీ జెల్లపు రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వరద బాధితులకు సాయం

సూళ్లూరుపేట, జనవరి 13: పట్టణంలోని వట్రపాలెం వరద బాధితులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక సాయం అందజేశారు. వట్రపాలెం సమీపంలో ఉన్న గ్రీన్ ఫీల్డ్ మైదానంలో ఆర్డీవో చంద్రముని, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ నాగేశ్వరరావు చేతుల మీదుగా స్టీల్ ప్లేట్లు, సామాను, దుప్పట్లను అందజేశారు. అంతకుముందు లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరేంద్ర కుమార్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఆదిశేషా రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు జెట్టి, అప్పారావు, బివి రవికుమార్, రాంరాజ్, గౌతమ్, గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.